ఓం అంఆ



మహోపదేశం

బ్రహ్మాండం వసుంధర

మహోపదేశం

రచయిత్రి :

శ్రీమతి బ్రహ్మాండం వసుంధరాదేవి

శ్రీమాతా ప్రచురణలు

జిల్లెళ్ళమూడి - 522 113.

గుంటూరు జిల్లా - ఆం.ప్ర.

MAHOPADESAM

By : BRAHMANDAM VASUNDHARA DEVI

First Edition April, 2003

Type Setting :
CHAKRAVARTHI
Bapatla. Ph: (08643) 224456

Cover Design :
SIVA. K
Guntur.

Printed at :
GANESH GRAPHICS
Sampath Nagar
GUNTUR - 522 004.
Phone : (0863) 2321573

Price : Rs. **50/-**

అంకితం



"తెలియజెప్పేవాడు గురువు,
తెలియజేసేవాడు దైవం" - అమ్మ

నాకు ప్రియతమ గురువు,
పతిదేవుడు అయిన "అమ్మ"కు
ఉడతా భక్తిగా ఈ చిన్న గ్రంథం సమర్పణ. - వసుంధర

విషయసూచిక

నివేదన

అమ్మ సందేశాలు ఈయదు, ఉపదేశాలు చేయదు అంటారు చాలామంది. ఆ మాట నూటికి నూరుపాళ్ళు నిజం కాదేమో అనిపిస్తుంది. ప్రతి ఒక నియమానికీ మినహాయింపు ఉంటుంది కదా!

ఒకానొక సందర్భంలో కొందరు అన్నయ్యలు అమ్మ దర్శనం చేసుకున్న తరువాత "అమ్మా మాకేదైనా సందేశం ఇవ్వమ్మా" అని అడిగితే అమ్మ ఇచ్చిన సమాధానం ఎంత ఉదాత్తమో చిత్తగించండి.

" మీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరణగా పెట్టుకో. అంతా వాడే చేయిస్తున్నాడనుకో".

సర్వసంపదలూ దైవానుగ్రహం వల్ల లభించినవే అది మీ స్వార్జితం కాదు అని "మీ అన్నం మీరు తృప్తిగా తినండి" ఇంతవరకు స్వార్థం ఆతర్వాతది పరమార్థం మీరు తినడమే కాదు ఇతరులకు పెట్టండి అని సందేశం ఇచ్చింది. అలా పెట్టటం అయిష్టంగా కాకుండా, మొక్కుబడిగా కాకుండ ఆదరణతో పెట్టమన్నది. అమ్మ సందేశం ఎంతగొప్పదో! ఈ సందేశం మనం ఆచరణలో పెట్టగలిగితే ప్రపంచంలో ఆకలిదప్పులు లేని, ఆర్థిక వ్యత్యాసాలు లేని ఒక ఆదర్శ సమసమాజం ఆవిష్కృతమవుతుంది.

ఉపదేశం చేయమని అమ్మను కోరినవాళ్ళూ ఉన్నారు. వారికి అమ్మ ఇచ్చిన సమాధానం "నేను గురువును కాదు, మీరు శిష్యులు కాదు - నేను అమ్మను మీరు బిడ్డలు" అవును - అమ్మ బిడ్డల పట్ల వాత్సల్యం చూపిస్తుంది వాళ్ళకు ఎప్పుడు ఏది అవసరమో అది అప్పుడు సమకూర్చి పెడుతుంది అంతే గానీ ఉపదేశం చేయదు.

అయితే అమ్మ ఉపదేశం చేసిన సందర్భాలు ఒకటి, రెండు అమ్మ దివ్య జీవన చరిత్రలో మనకు కనిపిస్తాయి. 1964వ సంవత్సరంలో విజయవాడ సమీపంలోని సీతానగరం నుంచి ఇద్దరు అక్కయ్యలు అమ్మ దర్శనం కోసం వచ్చారు. దర్శనం చేసుకున్న తర్వాత జరిగిన ప్రసంగంలో దేశిరాజు రాజమ్మ గారి ప్రస్తావన వచ్చింది. మంత్రాలు, ఉపదేశాల ప్రసక్తి వచ్చింది. అప్పుడు అక్కడే ఉన్న నాకు ఆ ప్రసక్తి మీద ఆసక్తి కలిగి ఆ అక్కయ్యలు వెళ్ళిపోయిన తర్వాత రాజమ్మ గారి గురించి వివరంగా చెప్పమని అమ్మను అడిగాను. అమ్మ అనుగ్రహించింది. అమ్మ చెప్తుంటే వ్రాసుకున్నాను. తరువాత అమ్మను "ఎప్పుడో జరిగినవి కదా అవన్నీ నీకెట్లా గుర్తుంటాయి? అమ్మా అని అడిగాను. "నాకెప్పుడో జరిగినట్లుండవు ఇప్పుడు

నాకళ్ళముందు జరుగుతున్నట్లుంటుంది. నాకంతా వర్తమానమే'' అని చెప్పింది. మనకు ఆశ్చర్యమే కదా!

అది 1949వ సంవత్సరం. అప్పటికి అమ్మకు మూడవ బిడ్డ చిరంజీవి రవి జన్మించాడు. అమ్మ పిన్నత్తగారు బ్రహ్మాండం అనసూయమ్మ గారు అమ్మను రాజమ్మగారి దగ్గరకు తీసుకువెళ్ళి - అమ్మా ఏదైనా ఉపదేశం చేయమని ఆమెని అర్ధిస్తుంది. అందుకు ఆమె అంగీకరించి ఉపదేశ కార్యక్రమం ప్రారంభిస్తుంది. అది మూడు రోజులపాటు నడుస్తుంది. ఆ మూడు రోజులు అమ్మకూ రాజమ్మ గారికి మధ్య జరిగే సంభాషణ చాలా విచిత్రంగా ఉంటుంది. అమ్మ వాక్చమత్కృతికి మనం నివ్వెరపోతాం. ఉదాహరణకు - "ఆశీర్వచనం అంటే నిర్వచనం లేనిది'' సృష్టి అనాది, నాది'' ఇలా మాటల్లో చమత్కారం ఆటలాడుతుంది. మరికొన్ని మాటల వెనుక దాగివున్న తర్క వైభవానికి మనకు సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి.

"భిన్నత్వం లేకపోవటమే దైవత్వం'' ఇలా అనటం అద్వైతానికి అసలైన వ్యాఖ్యానం అనుకుందామా లేక తర్క విజ్ఞానానికి ఉదాహరణగా తీసుకుందామా? "దైవం తలుస్తేనే కాని తాను తలిచేది లేదు'' అన్ని సంకల్పాలు, వికల్పాలు కూడా - దైవానికి సంబంధించినవే కాని మానవయత్నంలో లేవనేగా ఈ ప్రవచనం తెలియజేసేది.

అమ్మ మాటలు వెదజల్లిన జ్ఞాన ప్రసూన పరిమళాలలో రాజమ్మ గారు ఉక్కిరిబిక్కిరి అయిపోతారు. తనను తాను మర్చిపోతారు. చుట్టూ జరిగేది ఏమిటో గ్రహించలేని సమాధిస్థితిలోకి వెళ్ళిపోతారు.

సర్వశక్తిమయి, సర్వమంత్రస్వరూపిణి, సద్గతిప్రదాయిని అయిన జగజ్జనని దివ్యదర్శనం ఆమెకు లభిస్తుంది. ఇక్కడ మనకు రెండు ప్రశ్నలు ఎదురవుతాయి రాజమ్మ గారి దర్శనం కోసం అమ్మ వారి ఇంటికి వెళ్ళిందా లేక రాజమ్మ గారికి దేవీ సాక్షాత్కారం ప్రసాదించడానికి వెళ్లిందా? ఇది మొదటి ప్రశ్న. ఇక రెండవ ప్రశ్న - అమ్మకు రాజమ్మ గారు మంత్రోపదేశం చేశారా లేక అమ్మే రాజమ్మ గారికి మహోపదేశం చేసిందా?

విజ్ఞులైన పాఠకులు సమాధానాల కోసం ఆలోచించాలి.

శ్రీకృష్ణ పరమాత్మ చేసిన గీతోపదేశం అర్జునుడికి ఒక్కడికే పరిమితం కాదు. ఎక్కడ సందేహం, సంశయం ఉన్నాయో ఎక్కడ జీవాత్మ, పరమాత్మ ద్వైతం ఉన్నదో అక్కడ భగవద్గీత అవసరం ఉన్నది. అది సార్వజనీనం, సార్వకాలికం, అలాగే అమ్మ చేసిన మహోపదేశం కేవలం ఒక్క రాజమ్మ గారికే కాదు అమ్మ బిడ్డలమైన మనందరికీ. అంతటి మహత్తర జ్ఞాన సంపదను ఆవిష్కరించిన మహోపదేశం అమ్మనోటివెంట

వినే భాగ్యం నాకు లభించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను ఆనందిస్తున్నాను.

అమ్మకు రాజమ్మ గారికి మధ్య జరిగిన సంభాషణ వ్రాతప్రతిని మాతృశ్రీ సంపాదకులుగా ఉన్న శ్రీ కొండముది రామకృష్ణ అన్నయ్య చదివి అందులోని సంభాషణలను యధాతధంగా ఉంచి అనుసంధాన భాషను అవసరమైనంతవరకు సంస్కరించి మాతృశ్రీ మాసపత్రికలో 1966 జూన్ నుంచి 1967 మార్చి వరకు "రవ్వలూ, రత్నాలు" అన్న శీర్షికతో సీరియల్‌గా ప్రచురించారు.

ఈ గ్రంథం ఆసాంతం చదివి "అక్షరామోదం" భావగర్భితంగా వ్రాసిఇచ్చిన విద్వత్కవులు, "అంబికా సుప్రభాతం, సంధ్యావందనం, కరావలంబస్తోత్రం రచయిత శ్రీ పన్నాల రాధాకృష్ణశర్మ అన్నయ్యకు మనఃపూర్వక నమస్కారాలు.

ఈ గ్రంధాన్ని పఠించి అమ్మలోని గురుతత్వాన్ని దర్శించి "సకల గురుస్వరూపిణి అమ్మ" భావస్ఫోరకంగా వ్రాసి ఇచ్చిన సమర్థ సద్గురు సంస్థాన పీఠాధిపతి డా॥ మారెళ్ళ రామకృష్ణ మాష్టారికి నమస్సుమాలు.

ఆర్థిక సహాయం అందజేసిన అన్నయ్యలకు అక్కయ్యలకు హార్థిక వందనాలు. వారు శ్రీ బత్తుల శివప్రసాద్ వారి భార్య ఉషారాణి (ఒంగోలు) శ్రీ వెంకటేశ్వరరావు, శ్యామల (ఒంగోలు), ఉభయ పరిషత్తుల అధ్యక్షులు శ్రీ బొప్పూడి రామబ్రహ్మం గారు (విజయవాడ) ఉభయ పరిషత్తుల ఉపాధ్యక్షులు శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న శాస్త్రి గారి జ్యేష్ఠపుత్రుడు శ్రీ సోమసుందరరావు (యుఎస్ఎ) శ్రీ ఎవిఆర్ సుబ్రహ్మణ్యం (బందరు) శ్రీమతి బోళ్ళ వరలక్ష్మమ్మ గారు, ఆమె కుమార్తెలు సరోజని, తులసి (ఢిల్లీ), టిటి అప్పారావు గారు (ఏలూరు).

మొదటిసారిగా ఈ రచనను "మాతృశ్రీ" మాసపత్రికలో సీరియల్‌గా ప్రచురించి కీ॥శే॥ శ్రీ కొండముది రామకృష్ణ అన్నయ్యకు, శ్రీ కొండముది గోపాల్ అన్నయ్యకు, గ్రంథ ముద్రణలో అడుగడుగునా సహకరించిన హనుమంతరావు అన్నయ్యకు, సోదరి భట్టిప్రోలు సుగుణకు, సోదరుడు శివకు కృతజ్ఞతాభివందనాలు.

ఇప్పుడు గ్రంథ రూపంలో తీసుకురావడానికి ప్రోత్సహించిన శ్రీ విశ్వజననీ పరిషత్, మాతృశ్రీ విద్యాపరిషత్ వారికి అనేకానేక ధన్యవాదాలు.

- శ్రీమతి బ్రహ్మాండం వసుంధరాదేవి

అక్షరామోదం

- డాక్టర్ పన్నాల రాధాకృష్ణశర్మ

"అమ్మ" అని అందరిచేత ఆప్యాయంగా పిలువబడిన జిల్లెళ్ళమూడి అమ్మకూ, దేశిరాజు రాజమ్మ గారికీ మధ్య జరిగిన సంభాషణలకు అక్షర రూపం "మహోపదేశం" అనబడే ఈ గ్రంథం. ఇది పరిమాణంలో చిన్నదయినా ప్రమాణంలో గొప్పది. దీనిని సావధానంగా పరికించిన వారికి "మహోపదేశం" అన్నపేరు సార్థకమనిపిస్తుంది.

అమ్మ మాటలు చమత్కారపేటికలు, జ్ఞానామృత గుటికలు. అమ్మలోని అసాధారణ తాత్విక దృష్టినీ, అలౌకిక ప్రవృత్తినీ గమనించిన అమ్మ పిన్నత్త గారయిన అనసూయమ్మగారు మరల మాయాపరవశయై అమ్మకు పెద్దల చేత ఉపదేశం చేయించి ఉన్నత స్థితిని గలిగించవలెననే భ్రమతో వేదాంత పఠన, ప్రవచనాలలో ప్రవీణురాలయిన దేశిరాజు రాజమ్మ గారివద్దకు అమ్మను దీసికొని వెళ్ళటమూ, ఆ పిమ్మట రాజమ్మ గారికీ అమ్మకు మధ్య సంభాషణ జరగటమూ జిజ్ఞాసువులయిన అమ్మ బిడ్డలకు ప్రసాదాలుగా పరిణమించాయి.

రాజమ్మ గారికి కొన్ని కోట్ల మంత్రజపఫలంగా అమ్మ దర్శనం ఉపదేశ వ్యాజంతో లభించి ఆమెకు వ్యక్తిగతంగా విజ్ఞానదాయకమయినా అమ్మ సంతానమునకు మాత్రం ఈ సంభాషణ సారమయిన ఈ మహోపదేశం శాశ్వతంగా మార్గదర్శకమణిదీపంగా భాసిస్తున్నది. ఈ విషయం - "ఈ కార్యక్రమం అచ్చగా నా కొరకు గాదు, మీకూ, నాకూ ప్రపంచానికీ" - అనే వాక్యంలో అమ్మ స్పష్టం చేసింది.

ఇక స్థాలీపులాక న్యాయంగా అమ్మ మాటలలోని చమత్కృతి వైభవమును, జ్ఞానజ్యోతినీ తెలిసికొనటానికి ప్రయత్నిద్దాం:-

రాజమ్మ గారు - "రాత్రి జరిగింది నిజమా? భ్రమా? కలగన్నానా? అని అంటే, అమ్మ - "మీరు కలగన్నారో కథ విన్నారో నాకేం తెలుసు? నేను మిమ్మల్ని కనేందుకు వచ్చాను" అన్నది. ఇక్కడ 'కనేందుకు' అనే మాటకు 'చూచేటందుకు' అనీ, 'ప్రసవించేటందుకు' అనీ రెండర్థాలున్నాయి. ఇది అమ్మ దృష్టిలో 'ప్రసవం' - అనగా, రాజమ్మ గారికి 'జ్ఞానోదయమనే పునర్జన్మ' నివ్వటం కావచ్చు. కానీ రాజమ్మ గారు 'కనేందుకు కాదు' - 'కనిపించేందుకు' అని సవరించగా మరల అమ్మ 'ఏమిటీ ? కనిపెంచేందుకా?' అని ఆ మాటను చమత్కరించింది. ఈ మాటకు విభ్రాంతురాలైన రాజమ్మ గారికి రాత్రి కలిగిన దర్శనం మరొక్కమారు దృగ్గోచరమయింది. ఈ సన్నివేశం 'కన్నబిడ్డలేకాదు, కన్న బిడ్డలు గూడ అమ్మ ప్రేమ పయస్సులందుకొనిరి" అన్న

వాక్యమును గుర్తుకు తెస్తున్నది.

ఒక సందర్భంలో రాజమ్మగారు - "ఎవరి సంకల్పము?" అని ప్రశ్నించగా "సంకల్పించిన వారి సంకల్పము" అని అమ్మ అన్నది. తిరిగి రాజమ్మగారు - "దైవ సంకల్పము కాదా?"అని ప్రశ్నించగా, అమ్మ - "దైవ సంకల్పము కాదమ్మా ! సంకల్పమే దైవము" అని సంకల్పమును నిర్వచించింది. ఇది ఒక అద్భుతమైన వివరణ.

మరొకచోట రాజమ్మ గారికి సృష్టిని గూర్చి చెబుతూ, అమ్మ - "సమష్టి యెక్క వ్యష్టిత్వమే యీ ప్రపంచము" అని వివరించింది. ఈ సందర్భం - "సదేవసోమ్యేదమగ్రాసీదేకమేవాద్వితీయం", "తదైక్షతబహుస్యాంప్రజాయేయేతి" అనే ఛాందోగ్యోపనిషద్వాక్యాలను స్ఫురింపజేస్తున్నది.

అలాగే 'క్షర', 'అక్షర' జ్ఞాన చర్చ ఆలోచనామృతంగా సాగింది. "పరిపూర్ణత' అంటే ఏమిటమ్మా?" అని రాజమ్మ గారు అడుగగా "సర్వత్రభిన్నత్వం లేకపోవడమేనమ్మా!" అని అమ్మ చెప్పిన వాక్యం "సర్వంఖల్విదంబ్రహ్మ" అన్న శ్రుతి సూక్తిని స్ఫురింపజేస్తున్నది. ఈ వివరణకు నిదర్శనంగా అమ్మ తన చిన్నకొడుకయిన మూడేండ్ల రవికి నోటిలో ముద్దపెట్టి అతనిచే కొరికించి తిరిగి ఆ ముద్దను తీసుకుంటూ ఉండగా ఒక పిల్లి వచ్చి ఎగబడి ముద్దను కొరకటం, రాజమ్మ గారి పెంపుడు కుక్క వచ్చి విస్తరిలోని అన్నం మీద పడటం, పిల్లి కొరికిన అన్నమూ, కుక్క తిన్న అన్నమూ కలిపి ముద్ద చేసి అమ్మ తన నోటిలో పెట్టుకొనటం జరిగింది. ఈ సంఘటన శ్రీ షిర్డీసాయినాథుడు భిక్షాన్నమును కుండలోపెట్టడమూ, దానిని కాకులు, కుక్కలు మొదలయినవి యధేచ్ఛగా తినడమూ, సాయి వానిని తోలకపోగా ఆయన్నమునారగించడమూ గుర్తుకు తెస్తున్నది. అంతేకాక,

"విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగవిహస్తిని"।
శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః॥ (భ.గీ. 5-18)
అనే భగవద్గీతా వాక్యమును స్మరింపజేస్తున్నది.

ఇక బిచ్చగాడు రావడం, రాజమ్మ గారి ఆదేశంతో అమ్మ బిచ్చగానికి అన్నం వేయడం, బిచ్చగాని పిల్లను అమ్మ ఎత్తుకుని ఊరడిస్తూ ఆ పిల్ల నోట్లో ముద్దను కొంత పెట్టి మిగిలిన దానిని తాను తినటం, ఆ బిచ్చగాడు పాకీవాడు కావడం పాకీవాని పిల్ల తన పిల్లయని అమ్మకు కనిపించటం, అలాగే అందరూ తన పిల్లలవలె తన మనస్సులో ఉంటారనటం, సృష్టి అనాది నాదీ అని చెప్పటం మొదలైన వివరాలు గల సంభాషణ సన్నివేశం అమ్మ విశ్వజనీన ప్రేమకూ, విశ్వజననీత్వానికీ అద్దం పట్టుతున్నది. ఈ సందర్భం...

"Love in her was wider than the universe,
The whole world could take refuge in her single heart"
- (Savitri - Book I, Canto II)

అనే అరవింద మహాయోగి మాటలను స్ఫురింపజేస్తుంది.

మరొక చోట రాజమ్మ గారు - "తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది" అని యనగా, అమ్మ "దైవం తలిస్తేనే తాను తలుస్తాడు, తాను తలిచేది వేరే లేదు" అని రాజమ్మ గారి మాటలను సరిదిద్దింది. ఇది అమ్మ విజ్ఞాన పరిణతికి పరమోదాహరణం.

వేరొకచోట అమ్మ - "తన్ను తాను తెలుసుకోవడమంటే భగవంతుని తెలుసుకోవడమేగా! భగవంతుని తెలుసుకునేది తాను, తన్ను తెలుసుకునేదీ తానే. సర్వాన్ని తెలుసుకున్న తెలివే భగవంతుడా?" అని వివరించింది. ఈ సందర్భంవలన, "ఆత్మ, పరమాత్మ ఒక్కరే అనీ, పరమాత్మ జ్ఞాన స్వరూపుడనీ తెలియజేసినట్లయింది.

ఇక రాజమ్మ గారు అమ్మ చెవిలో బీజాక్షరాలు చెప్పి చేతికి జపమాలను అందించగా, అమ్మ కొలికిపూసపట్టుకుని ఓంకారోచ్ఛరణ ప్రారంభించగానే సర్వేంద్రియ నిశ్చలత్వం కలిగి సమాధి గతయై తిరిగి తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు జగ్రదవస్థలోనికి రావడం, తన ఒడిలో పడుకున్న రాజమ్మ గారి పాదాలను అమ్మ పట్టుకొనబోగా - "అమ్మా! తల్లీ! జగజ్జననీ! నా కాళ్ళు పట్టుకుంటావా? వద్దు వద్దు" - అంటూ రాజమ్మ గారు అమ్మ పాదాలను పట్టుకొనటం :- ఈ సన్నివేశం ఈ సంభాషణకు మకుటాయమానమైనది. ఇలా చెప్పుకుంటూపోతే మరొక గ్రంథమంతమవుతుంది.

సాధారణ గృహిణియై, సాధ్వియై, వేదాంత పఠన, ప్రవచనములను గావించే రాజమ్మ గారిని గురుస్థానంలోనుంచి ఆమెవల్ల మంత్రోపదేశం పొంది, తదుపదేశపులితమన్నట్లు సద్యస్సమాధిని పొంది, గురుస్థానీయురాలైన రాజమ్మ గారికి వేదాంత సారమైన పరమాత్మానుభూతిని ప్రసాదించిన అమ్మ పరమ జ్ఞాన స్వరూపిణిగా ఇక్కడ సాక్షాత్కరించింది.

ఈ గ్రంథం మాతృశ్రీ కల్పలతకు పూచిన విజ్ఞాన ప్రసూనం. ఇది "మాతృశ్రీ జీవితమహోదధిలోని ఒక ఉత్తుంగ తరంగం" అన్నమాట పరమసత్యం. ఈ గ్రంథ ముద్రణకు ప్రేరణనిచ్చిన సోదరులకూ, ఇది వెలుగులోనికి రావటానికై ప్రధాన భూమికను పోషించిన మాతృమయ జీవిత, సోదరి వసుంధరకూ నా హార్థిక శుభాకాంక్షలను తెలుపుకుంటున్నాను. జిజ్ఞాసువులు ఈ అక్షరామృతము నాస్వాదించి, వెలుగుబాటలో పయనించి పరమ శ్రేయమును పొందునట్లుగా తన యనిర్వచనీయమైన ఆశీస్సులననుగ్రహించవలసినదని ఆజగన్మాతను ప్రార్థిస్తున్నాను.

సకల గురు స్వరూపిణి అమ్మ

అమ్మ ఆవిర్భావం నూతన మానవునకు అంకురం శ్రీ అరవింద, రమణ మహర్షి, బ్లావెట్స్కే, సి.వి.వి. శ్రీరామశర్మ ఆచార్య మొదలగువారు తెలియజెప్పిన రాబోయే నవ్యసమాజంలో మానవుల ప్రవర్తన, ఆలోచనా విధానానికి, పరిపూర్ణ రూపకల్పన "అమ్మ" నాలుగు వేదాల సంపుటియే జీవితము, అనుభవసారమే శాస్త్రమని అమ్మ అభిప్రాయము. ఆధ్యాత్మిక - విద్య అనగా నిజంగా జీవించడం - ఎలాగో తెలియజేసే గురు-శిష్య సంబంధం ఈనాడు పూర్తిగా కొన్ని కర్మ కాండలకు మాత్రమే పరిమితమైపోతే దానిని వ్యవస్థీకరించేందుకు "అమ్మ" రాజమ్మ గారివద్ద దీక్ష తీసుకునే నాటకం గురుశిష్య సంబంధముల అనేక రహస్యాలు విశదీకరిస్తుంది. ఈ పుస్తకమును ఒకసారి చదివి ప్రక్కన పడేయకుండా మళ్ళీమళ్ళీ అధ్యయనం చేస్తే ప్రతి సంఘటన ఒక విశేష విజ్ఞానాన్ని - జీవించే విధానాన్ని బోధిస్తుంది "అమ్మ" యొక్క ప్రతి పలుకు ఒక మంత్ర మహోదధి. మననం చేసుకుంటే అనూహ్య అనుభవాన్నిస్తుంది.

ఉదాహరణకు :-


దైవసంకల్పం కాదమ్మ - సంకల్పమే దైవము - పేజీ నెం.8
కార్యము ఎప్పుడూ క్రమంగానే జరుగుతుంది - పేజీ నెం.9
నేనే సృష్టి. నా సంగతి సృష్టి. నాకు చెప్పేవారు సృష్టి.
వ్యష్టి సృష్టి, సమిష్టి సృష్టి సమిష్టి యొక్క వ్యష్టిత్వమే సృష్టి. పేజీ నెం.13
ఇదంతా నాపనేగా నాపనే కష్టమైతే ఎంతసేపు కూర్చునేది. పేజీ నెం.13
మడి ఆస్థితి అంతా మనస్సుకే రావాలేనని అనుకున్నానమ్మా. పేజీ నెం.16
మీరు నేనుగా వున్న అనసూయమ్మను కాను
నేను అనే నేను నేనే అనే నేను ఆ నేనే సర్వం. పేజీ నెం.17
దైవం తలిస్తేనే తాను తలుస్తాడు తాను తలిచేది వేరే లేదు. పేజీ నెం.42

అమ్మకు దీనిని శాస్త్ర పరంగా అందించే అలవాటు లేదు. తెలియజేయడమే కానీ తెలియచెప్పటం కాదు. ఈ విధమైన మాణిక్యాలు ఎన్నెన్నో ...

ఈ పుస్తకం ద్వారా అమ్మ జ్ఞానాన్నే కాక అమ్మ యొక్క గురుస్వరూపం మానవజాతికి లభించింది. ఈ గ్రంథాన్ని మళ్ళీమళ్ళీ చదివి "అమ్మ" తెలియజేసే ఆ అనుభూతి అందరూ పొందాలని అమ్మను ప్రార్థిస్తున్నాను.

ఇట్లు :

డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ, ఎం.ఎస్.సి., పి.హెచ్.డి.
సమర్థ సద్గురు సంస్థాన్ పీఠాధిపతి శ్వేతద్వీపము, ఒంగోలు.



అమ్మ - రాజమ్మగారు

మహోపదేశం

అమ్మ అవతరణ, అయినప్పటినుండీ అనేకులు తమ తమ యోగ్యతా, అర్హతల ననుసరించి అమ్మలో అసాధారణ తత్వమూ అలౌకిక ప్రవృత్తీ గమనిస్తూ వచ్చారు. ఆ మాటకు వస్తే, అమ్మ మాటప్రకారమయితే - అమ్మ అనుగ్రహం ఎప్పుడు ఎవరిపై ప్రసరిస్తే వారికి అప్పుడు ఆ అదృష్టం కలిగింది. మరి 'నేను చూస్తే కనబడను; నే కనబడితే చూస్తారు' అని అమ్మ అన్నదికదా.

ఆ సమయమూ అదృష్టమూ అమ్మ పిన్నత్తగారయిన అనసూయమ్మగారికి ప్రాప్తించింది. అయితే ఆ అనుగ్రహంలోకూడా తరతమ భేదాలుండవచ్చును. ఒకరిలో మెరుపు మెరిసినట్లు మెరిసిపోతే, మరొకరిలో శాశ్వతదీపమ్మై వెలుగవచ్చును.

అమ్మ ఆవిర్భవించిన యిరవై ఆరు సంవత్సరాల తర్వాత అమ్మ పిన్నత్తగారు అనసూయమ్మ గారు అమ్మలోని అసాధారణ కాంతిని గమనించ కలిగింది కానీ, అంతలోనే తెర వాలి - ఎవరయినా పెద్దవాళ్లవద్దకు అమ్మను తీసుకు వెళ్లి ఉపదేశం చేయిస్తే ఉన్నతిని పొందగలదని భ్రమపడ్డది. అనేకులకు మంత్రప్రదానం చేసి గురుత్వం వహించిన - దేశిరాజు రాజమ్మగారి వద్దకు అమ్మను తీసుకువెళ్లింది.

కానీ, ఏ కార్యానికీ ఏమి కారణమో మనం ఊహించలేము. అసలు అనసూయమ్మ (అమ్మ) సంకల్పం వేరు. ఈ అనసూయమ్మ ఉద్దేశం వేరు.

అదీగాక రాజమ్మగారికీ తరుణం ఆసన్నమయింది. అమ్మ అవ్యాజ కరుణావారాశిలో తలమునకలుగా స్నానంచేసే సమయం వచ్చేసింది కనుకనే అనసూయమ్మగారు అమ్మను రాజమ్మగారి వద్దకు తీసుకు వెళ్లింది.

అమ్మ దృష్టిలో వేదాంతం అంటే అదేదో అందని విద్యాకాదు; అంతుపట్టని సిద్ధాంతాల సముదాయమూకాదు. నాలుగు వేదాల సంపుటియే జీవితమని, అనుభవసారమే శాస్త్రమనీ అమ్మ అభిప్రాయం. అందువల్ల అమ్మ

జీవితానికీ, అనుభవానికీ - వేదాంతానికీ, శాస్త్రాలకూ, భేదం లేదు. కానీ రాజమ్మగారి లాంటి వారికి వేదాంతమూ, జీవితమూ విభిన్నము; శాస్త్రమూ అనుభవమూ విభిన్నము. వారిది దంతవేదాంతం మాత్రమే. వారు వేదాంతం పఠించేవారూ, ప్రవచనం చేసేవారూ మాత్రమే. వారి మాటల్లోని అద్వైతం ఆచరణకు అందదు.

మరి, అమ్మ అట్లాకాదు. అమ్మ దైవం అనే విషయం అటుంచి ఆలోచిస్తే - అమ్మ వేదాలూ, వేదాంతాలూ అధ్యయనం చేయలేదు. శాస్త్రాలు అభ్యసించలేదు. అయితేనేం, జీవితాన్ని అనుభవించిందీ, అనుభవాన్ని జీర్ణించుకుంది. జీవితంలో అన్ని ఎత్తులకూ వెళ్లింది; అన్ని లోతులూ చూసింది. అన్ని దిక్కులా అన్నిమూలలా అవగాహన చేసుకుంది. అందుకనే సర్వ శాస్త్రాలూ వేదవేదాంగాలూ ఆమె పాదాలమ్రోల తలవంచినయ్. అమ్మ లోకాన్ని అధ్యయనం చేసింది, లోకంలో సమస్త వస్తువులూ, జీవజాలమూ జడచైతన్య భేదరహితంగా 'ఒకటి' గానే గుర్తించింది. అమ్మ దానినే ఏకాగ్రత అని నిర్వచించింది. సర్వకాల సర్వావస్థలయందు ఆ సమానస్థితికి భంగంలేదు. దానినే అమ్మ సమాధి అన్నది అమ్మ ఎప్పుడూ ఆ సమాధిలోనే ఉంటుంది. కనుకనే అమ్మ ఎప్పుడు ఏమి పలికినా ప్రతిమాటా శాస్త్ర బద్ధంగానూ, వేద సమ్మతంగానూ ఉంటుంది అద్వైతాన్నే ఉద్ఘాటిస్తూ ఉంటుంది. అందువల్లనే యీ అద్భుత సమావేశంలో అమ్మకూ రాజమ్మ గారికీ జరిగిన సంభాషణ అనుభవానికీ ఆచారానికీ సంఘర్షణగా తోస్తున్నది.

బాపట్లలో శ్రీ దేశిరాజు బాపారావుగారింట్లో 1949 ఆగష్టు 22వ తేదీన సాయంత్రం గం.5-30 ని. లకు అమ్మ రాజమ్మగారిని దర్శించి పటికబెల్లం చేతిలో ఉంచబోయింది. రాజమ్మగారు తీసికొనక క్రింద పెట్టమన్నారు. అమ్మ నమస్కరించబోగా పాదములు వెనుకకు తీసుకున్నారు. రెండు గజములు దూరముగా వెళ్లిఅమ్మ కూర్చున్నది.

రాజమ్మ : పాదములు ముట్టుకోనీకపోవుట ఎందుకంటే-ఇతరుల దోషములు,

నా పాదములు తాకినప్పుడు నాకు తగులునని.

అమ్మ : అందువల్ల బాధ యేమీ లేదమ్మా.

రాజమ్మ : మీది ఏ వూరు?

అమ్మ : జిల్లెళ్లమూడి.

రాజమ్మ : ఎక్కడ ఆ వూరు?

అమ్మ : ఈ వూరికి దగ్గరలోనే. ఒకవైపుపోతే ఎనిమిది మైళ్లూ. మరొకవైపు పోతే ఆరు మైళ్లు ఉంటుందంటారు.

రాజమ్మ : ఆ ఊరిలో మీరేమి చేస్తుంటారు?

అమ్మ : అందరి ఇళ్లల్లో సాధారణంగా ఆడవారు ఏమి చేస్తుంటారో నేనూ అదే చేస్తుంటా.

రాజమ్మ : నీ సంగతి కాదు నీభర్త అక్కడ ఏమి చేస్తుంటారు?

అమ్మ : ఆ గ్రామానికి కరణం.

రాజమ్మ : పిల్లలా, అమ్మా?

అమ్మ : ఉన్నారమ్మా.

రాజమ్మ : ఎందరు?

ప్రక్కన ఉన్న పిన్నత్తగారు అనసూయమ్మగారందుకొని 'ముగ్గురు' అని చెప్పారు.

రాజమ్మ : ఈ అమ్మాయికి, మీకు బంధుత్వమున్నదా?

అనసూయమ్మ : మా బావగారి కోడలు. అని చెప్పి ఆమె వెళ్లిపోయింది.

రాజమ్మ : అమ్మా ! ఎందుకు వచ్చావు?

అమ్మ : మీ దగ్గర ఏమి పని ఉంటుంది? – దర్శనమే

రాజమ్మ : దర్శనమేనా? ఇంకేమన్నా ఉద్దేశ్యమున్నదా?

అమ్మ : వేరే ఉద్దేశాలిప్పటికి ఏవీ లేవు. మొన్న 10వ తేదీ రాత్రి మిమ్ములగురించి మా అనసూయత్తగారు చెబితే దర్శనము చేసుకుందామని వచ్చాను.

రాజమ్మ : ఏమైనా సత్కాలక్షేపం చేస్తుంటావా అమ్మా?

అమ్మ : అంటే –?

రాజమ్మ : భగవంతుడిని గురించి మంచిమాటలు – అంటే సద్గోష్ఠి.

అమ్మ : మళ్లీ మళ్లీ అడిగానని అనుకోవద్దు. సద్గోష్ఠి అంటే అర్థం కాలేదమ్మా. చేస్తున్న పనులలో, మామూలుగా మాట్లాడే మాటలలో అర్థమయ్యేటట్లు చెప్పండి.

రాజమ్మ : ఏమీ చదువుకోలేదా అమ్మాయి. ఈ కాలం పిల్లలు యీమాత్రం అర్థంకాకుండా ఉండేవారు లేరే!

అమ్మ : ఎంతమందిని చూచినా ఇంకా మనము చూడనివారుండ వచ్చునుగదా, అందులో నేనొక దానినీ.

బాపారావుగారు రాగా అమ్మ లేచి నుంచుంది.

బాపా : ఎవరీ అమ్మాయి?

రాజమ్మ : ఎవరో నాయనా, యిప్పుడే వచ్చింది, మనయింటికి వస్తుందే, అనసూయమ్మ. వారి బావగారి కోడలు.

అమ్మ : చిదంబరరావుగారు మా తాతగారండీ.

బాపా : అంటే - చంద్రమౌళి చిదంబరరావుగారా? అంటే ఎట్లా తాతగారమ్మా?

అమ్మ : మా అమ్మకు పినతండ్రి. నాకు మేనత్త పెనిమిటి.

బాపా : అంటే ఆయన పెద్ద బావమరిది కూతురివా?

అమ్మ : అవును.

బాపా : అంటే మన్నవ కరణంగారు కదూ, మీనాన్న.

అమ్మ : అవును.

రాజమ్మ : భారతి మేనమామ కూతురివా నీవు? అయితే నీకు చదువు రాకపోవడ మేమిటి?

అమ్మ : భారతి మేనమామ కూతురునైనంత మాత్రాన చదువు వస్తుందా?

రాజమ్మ : కాలాన్ని బట్టీ కుటుంబాన్ని బట్టీ విద్య లేకపోవుట యేమిటీ అన్నాను.

అమ్మ : కాలము ఒకటేకానీ అనుభవాలు వేరుగా ఉండవచ్చు.

రాజమ్మ : కాలము ఒకటయినప్పుడు, అనుభవం వేరెందుకవుతుంది? ప్రొద్దు గ్రూకిందనుకో, అందరమూ ఒకేసారి దీపాలు పెట్టుకుంటున్నాము.

అమ్మ : ప్రొద్దుకూకడం ఒకేసారి కానీ దీపాలు ముట్టించడం ఒకేసారి జరుగలేదు. ఒకరే ముట్టించరు. ఒకేరకం దీపాలు కావు. కొన్ని యిళ్లలో దీపాలే లేవు.

రాజమ్మ : దీపాలు లేని యిళ్లుంటాయా?

అమ్మ : మనుషులులేని యిళ్లు లేవూ?

రాజమ్మ : అదికాదు; దీపాలు ముట్టించుకోకుండా వుంటున్నారేమో ఇళ్లల్లో అని అన్నా లేమ్మా.

అమ్మ : అట్లా కూడా ఉండవచ్చు.

రాజమ్మ : అది నీ అనుభవమా?

అమ్మ : అనుభవమంటే నేను దీపం పెట్టుకోకపోవడమే కాదు. పెట్టుకోని వారిని చూడడం కూడా నా అనుభవమేగా.

రాజమ్మ : ఆ దీపము కాస్త పెట్టమ్మా – నిప్పుపెట్టె తెచ్చి.

అమ్మ : లోపలకు వెళ్లి అన్నీ తాకవచ్చా?

రాజమ్మ : అంటే?

అమ్మ : పనికి వచ్చినవి పనికిరానివి ఉన్నవి గనుక.

రాజమ్మ : నిప్పుపెట్టె విడిగా చెక్కమీద ఉంటే తాకమ్మా.

అమ్మ : అసలు ఎక్కడ ఉందీ? తెలీదుగా అమ్మా. మీరు గుర్తు చెప్పితే ఉన్నదీ లేనిదీ చూచి చెప్తా.

ఇంతలో రాజమ్మగారి మనుమరాలు మాణిక్యం దీపం తీసుకువచ్చింది.

అమ్మ : అన్ని సందేహాలు ఇట్లాగే నివృత్తి కావలెనమ్మా

రాజమ్మ సరే! రేపు ప్రొద్దున్నే ఏడుగంటలకు రా, అమ్మా. ఈ రాత్రి యేమి కల వస్తుందో చూసుకో.

అమ్మ : మీ అనుగ్రహంవలన కలలన్నా వస్తే, ఏమి కల వచ్చినా సరే, చెప్పమంటారా? - కల వస్తుందంటారా? వస్తే చెప్పమంటారా?

రాజమ్మ : ఊం.

అమ్మ : గట్టిగా వస్తుందనా? లేకవస్తే చెప్పమనా? - ఊ కొట్టినది.

రాజమ్మ : ఎందుకు అంత గట్టిగా అడిగావు?

అమ్మ : ఏమీ లేదమ్మా కలలంటే నాకు చాల ఆశ. ఆశ ఎప్పుడూ లేని దానికేగా.

రాజమ్మ : అయితే కల రాదా?

అమ్మ : కల రాదు, ఏదీ కల్లగా లేదు.

రాజమ్మ : ఎప్పటినుండి రాదు కల?

అమ్మ : ఒకప్పుడు రావటమంటూ వుంటే ఇప్పటినుండి రావడం లేదని చెప్పుదును.

రాజమ్మ : అంటే ఎప్పుడూ రాలేదనా?

అమ్మ : ఇంతకూ, కల అనే దాన్ని గురించి మాట్లాడే అర్హత కూడా లేదేమో - కొంచెమైనా అనుభవంలేదు కనుక.

రాజమ్మ : రాత్రి 10 గంటలైన తర్వత మళ్లీ రా, వెళ్లు.

అమ్మ : వస్తానని చెప్పలేనమ్మా.

రాజమ్మ : అంటే – రావా?

అమ్మ : రానని మాత్రం ....

రాజమ్మ : సరే, పోయిరా. కుంకుమ వుంది. బొట్టు పెట్టుకో, అమ్మా.

రాజమ్మగారు కుంకుమభరిణ తీసుకువచ్చి దగ్గర ఉంచారు.

అమ్మ : మీకు తప్పు లేకపోతే మీరు పెట్టండి అమ్మా.

రాజమ్మ : నాకు అర్హత లేదుగా, అమ్మా.

అమ్మ : మనస్ఫూర్తిగా మీకు అర్హత లేదని తోస్తున్నదా? ప్రపంచమేమయినా అంటుందనా?

రాజమ్మ : అనాది ఆచారం.

అమ్మ : దీనివల్ల ఏప్రమాదమూ లేదంటారు – పెట్టినా, పెట్టక పోయినా.

రాజమ్మ : అవును.

అమ్మ : అయితే పెట్టండి.

రాజమ్మ : ఎందుకులే అమ్మా–

అమ్మ : అంతే – కీడూ, మేలూ ఆలోచిస్తుంటాము కదూ మనము. మీరు పెడితే కీడనేగా? కీడుచేయడమైనా మీచేతుల్లో ఉంటే అదయినా చేయండి చూద్దాం. ప్రథమం బొట్లు పెట్టించడం ముత్తైదువుల చేతనే పెట్టిస్తారు కదా – వైధవ్యం ఎందుకు?

రాజమ్మ : వాళ్ల యోగ్యత.

అమ్మ : అప్పుడు మీబొట్టు కారణం కాదుగా.

రాజమ్మ : లేదమ్మా. సరే బొట్టు పెట్టుకు పోయిరా.

అమ్మ బొట్టుపెట్టుకుని యింటికి తిరిగివచ్చింది.

1949వ సంవత్సరం ఆగష్టు నెల 23వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు అమ్మ రాజమ్మగారి దగ్గరకు వెళ్లి దర్శనము చేసికొనటానికి తలుపు దగ్గర నిలుచుని తలుపు తట్టుదామను కొనుచుండగా, రాజమ్మగారికి ఎవరో వచ్చినట్లు అలికిడయి, తలుపు తీయాలనిపించి, అకస్మాత్తుగా తలుపుదీసి

: ఎవరది?

అమ్మ : నేనమ్మా!

రాజమ్మ : నీవా? పిలిచావా? అమ్మా?

అమ్మ : పిలువలేదమ్మా. పిలిచినట్లుగా ఉన్నదా? పిలుద్దామనుకున్నాను; కాని అనుకోవటానికి తలుపు తీయటానికీ వ్యవధిలేదు.

రాజమ్మ : అమ్మా! అని పిలిచినట్లుందమ్మా

అమ్మ : పిలుద్దామనుకున్నప్పుడు, అమ్మా! అనే పిలుద్దామనుకున్నాను. సంకల్ప మాత్రం చేతనే మీకు వినిపించింది కాబోలు? ఎవరి సంకల్పమో?

రాజమ్మ : ఎవరి సంకల్పము?

అమ్మ : సంకల్పించినవారి రి ంకల్పము.

రాజమ్మ : దైవసంకల్పము కాదా?

అమ్మ : దైవ సంకల్పము కాదమ్మా! సంకల్పమే దైవము.

రాజమ్మ : మన సంకల్పము ఉండాలి. వాడి దయ ఉండాలి (అంటూ) లోపలికిరా అమ్మా!

(అమ్మ లోపలికి ప్రవేశించింది)

రాజమ్మ : అమ్మా! ముఖము కడుక్కున్నావా?

అమ్మ : కడుక్కున్నానమ్మా! ఇందాక మన సంకల్పమూ, వాడిదయా అన్నారే, సంకల్పం ఎవరిచ్చేది?

రాజమ్మ : సంకల్పము కూడా వాడిదేలే అమ్మా?

అమ్మ : మనది అన్నారు? కొంతసేపు అటూ, కొంతసేపు ఇటూ ఉంటుందా? అసలు రి ంకల్పమంటే నిర్వచనమేమిటి?

రాజమ్మ : మనస్సుకు తోచే ఊహయే సంకల్పం.

అమ్మ : వికల్పాలంటే యేమిటమ్మా? అవి ఎవరికి తోచేవి?

రాజమ్మ : వికల్పాలూ మనస్సున కలిగేవే.

అమ్మ : అయితే నాకో సందేహం వచ్చిందమ్మా? సంకల్పం - వికల్పం ఈ రెంటికి తేడా కూడా వివరించండి.

రాజమ్మ : అది అనుభవ రూపంగా రావాలికాని.................

అమ్మ : అది ఎవరికి కలిగేది? దేనికి కలిగేది?

రాజమ్మ : అదీ మనస్సుకే లేవమ్మా!

అమ్మ : ఇంకా ఏవన్నా అడగమంటారా? అసలు నన్ను రాత్రి పది గంటలకు ఎందుకు రమ్మన్నారు? నేను రాలేకపోయినాను. కొన్నిగంటలు తేడాయేగదా అని నాలుగు గంటలకు వచ్చాను.

రాజమ్మ : ఇంతకూ కార్యక్రమం ఏమనుకున్నావు?

అమ్మ : కార్యం ఎప్పుడూ క్రమంగానే జరుగుతుంది.

రాజమ్మ : జరుపుకోవాలిగా!

అమ్మ : మీరు విసుక్కోకుండా ఉంటే. అడుగడుగునా మాట్లాడే ఈ ద్వంద్వాలు కొంచెం సేపు ఇటూ కొంచెంసేపు అటూ చెప్పే సందేహాలూ............. అయినా నాకు మాట్లాడటం చేతకావటంలేదు. ఇటీవల ఏ పెద్దలను చూడలేదు. అయితేమీరు 'అమ్మ' అంటే అంతులేని అడ్డులేనిది అని వచ్చాను.

రాజమ్మ : వస్తే యిప్పుడేం పోయింది?

అమ్మ : రాకపోవడం పోయింది.

రాజమ్మ : అయితే రావటం వచ్చిందనా?

అమ్మ : చెప్పటం ఎందుకు?

రాజమ్మ : అయితే ఏమన్నా చెప్పుకుంటావా?

అమ్మ : చెప్పుకోవటమంటే తెల్లవారుజామునుండీ మాట్లాడేదంతా చెప్పుకోవడమేగా?

రాజమ్మ : అదేననుకో, కానీ చేయవలసిన కృషి వేరుగా వుంది.

అమ్మ : ఇప్పుడు నాకు మీరు చెప్పవలసినది కూడా 'కృషి యెవరిది? చేసేది యెవరు? చెప్పేది యెవరు? చేయించేది యెవరు? - అని.

రాజమ్మ : అదే చెబుతా.

అమ్మ : అయితే అందుకే వచ్చాను.

రాజమ్మ : నిన్న సాయంకాలం దర్శనమే అన్నావుగా?

అమ్మ : నిజమే, దర్శనము కొఱకే వచ్చాను. దర్శనముయొక్క అర్థం మాత్రం ఈ సంభాషణ.

రాజమ్మ : అనసూయమ్మగారు ఏదో చెప్పారులే.

అమ్మ : ఏదో చెప్పారంటే?

రాజమ్మ : ఆ! నీకు కావలసిన సంగతి

అమ్మ : నాకు కావలసిన సంగతిని అనసూయమ్మగారు చెప్పడమేమిటి?

రాజమ్మ : నీవు చెప్పించావేమో అనుకున్నానమ్మా!

అమ్మ : అడ్డులేని అంతులేని అమ్మకు కూడా తెరలు ఉన్నయ్యా? అరలు ఉన్నయ్యా?

రాజమ్మ : నాకర్థంకావడం లేదు నీ భాష.

అమ్మ : నా భాషయే అర్థం కావడంలేదా? అమ్మాయే అర్థం కావడం లేదా?

రాజమ్మ : నీమాటలు ఏదోరకంగా ఉన్నాయి.

అమ్మ : అంటే, ఇందాక అన్నారు గదూ? ఆ మాయ అర్థంకావడం లేదని.

రాజమ్మ : నేను మాయఅని అనలేదే; నీభాష అని అన్నాను గాని.

అమ్మ : మాయ అనేమాట భాషయే. మాట్లాడేదంతా భాష. వినేదంతా శబ్దం. చూచేదంతారూపం: అని అనుకుంటారు. అనుకోవడంగాక నిన్ననేను వచ్చేటప్పటికి మీరు ప్రక్కన కూర్చున్నవారితో చెప్తున్న మాటల్లో ఈ మూడు మాటలు మీనోటి వెంటరాగా నేను విన్నాను: కానీ అర్థం కాలేదు.

రాజమ్మ : సరేగానీ అయిదున్నర గంటలయింది. పొరపాటు. ఆరు గంటలయింది. పెందలకడ స్నానంచేసి వస్తే ఆ కాస్తా పూర్తి చేసుకుందాము?

అమ్మ : ఆ కాస్తే పూర్తిగా అవుతుందా?

రాజమ్మ : పూర్తియేమిటి? పూర్తి చేసుకుందామంటున్నా.

అమ్మ : నేను అనేది అదేనమ్మా: పూర్తి అయ్యేదానిని అనుకోవడం ఎందుకు? దానంతట అయ్యేది ఎటూ అవుతుంది. చేసుకుందామనుకునేది చెప్పుకోవటం అవుతుంది.

రాజమ్మ : సరేగాని, నీపేరేమిటి యింతకూ?

అమ్మ : మా అత్తగారి పేరే.

రాజమ్మ : అనసూయమ్మా?

అమ్మ : ఊం.

రాజమ్మ : ఊం. సరే తల్లీ! పోయిరా. ఇంతకూ కల వచ్చిందా?

అమ్మ : అమ్మా! కలను గురించి వస్తుందని చెప్పినవారికి వచ్చినదీ, రానిదీ తెలియదా?

రాజమ్మ : అమ్మా! నీకు పెద్దలతో మాట్లాడటం తెలియదనుకుంటాను.

అమ్మ : పెద్దలకు, చిన్నలకు తేడాయే తెలియదు.

రాజమ్మ : ఇటువంటి దానికి అతకడం కష్టం.

అమ్మ : అతకనిదేమిటి? అతికేదేమిటి?

రాజమ్మ : జ్ఞానం తల్లీ!

అమ్మ : అతకనిది అజ్ఞానమా? అతకనిది అజ్ఞానమైతే అతికేది జ్ఞానమేగా!

రాజమ్మ : నీదంతా పసిబిడ్డవతుగా ఉంది.

అమ్మ : పసిబిడ్డవతుగా ఉందిగాని, పసిబిడ్డను కాలేదుగా!

రాజమ్మ : నాకట్లా ఉంది.

అమ్మ : అదే నిజమైతే నాకు కావలసినదేమిటమ్మా?

రాజమ్మ : కేవలం పశుత్వమేగా అది.

అమ్మ : పశుత్వమే పసితనమా? ఆ రెంటికి తేడాలు లేవా? చూచే మనకు లేదా? ఆ రెంటికి తేడా తెలియదా?

రాజమ్మ : ....

(ఇంతలో బజారులో గేదె, దూడ, వెంట వీపున పసిబిడ్డతో ఆడమనిషి; ఆమె వెనుక భర్త వెళ్లుతూ వాకిట్లో ఎందుకో ఆగుతారు.)

అమ్మ : అది పసిబిడ్డ, నేను పశువును అని పశువుకుతెలియదా? దూడకు అది అమ్మ, మేత వేసేవాడు తన జాతికాదని దానికి తెలియదా? వీపున ఉన్న పసిబిడ్డకు, అదిగొడ్డు, తన నెత్తుకున్నది తల్లి అని తెలియదా? చెప్పగలిగినదీ, చెప్పలేనిదీ, ఉన్నదానిని మరొకరకంగా గుర్తించేదీ ఉన్నది ఉన్నట్లుగా గుర్తించేదీ – అన్నీ తెలివేగా!

రాజమ్మ : అంతా తెలివే! హెచ్చుతగ్గులున్నాయిగా అమ్మా!

అమ్మ చూడగా హెచ్చు, తగ్గూ సృష్టియేమో!

రాజమ్మ : సృష్టిదాకా నీకెందుకు? నీది నీవు చూచుకో.

అమ్మ : నేను సృష్టి, చూచేది సృష్టి, నా సంగతి సృష్టి, నాకు చెప్పేవారు సృష్టి వ్యష్టి సృష్టి, సమష్టి సృష్టి, సమష్టియొక్క వ్యష్టిత్వమే యీ ప్రపంచము.

రాజమ్మ : నీకు అక్షర జ్ఞానమున్నదా? అమ్మా!

అమ్మ : క్షర జ్ఞానము తప్ప అక్షర జ్ఞానము లేదు.

రాజమ్మ : ఎందుకనీ?

అమ్మ : ఆ రెంటి తేడా తెలియదుగనుక,

జ్ఞానమనేది అనేక విధాలా? ఒకటేనా?

తెలియనిది తెలుసుకుందే జ్ఞానము అన్నీ తెలియనిదా? అన్నీ తానైనదా? అన్నీ తానుకానిదా? కొన్ని అయి కొన్ని కానిదా? ఇన్నీ తెలిసి ఒకటిగా ఉండేదా?

రాజమ్మ : సరేలే అమ్మా!

అమ్మ : సరేలేమ్మా అంటే, వీటన్నింటికీ సరేలే అనా? సరేలే అంటే ఒప్పుకొన్నట్లా? మనకెందులే అనే విసుగా?

రాజమ్మ : విసుగూలేదు; ఒప్పుకోనట్లూకాదు. కాలం చాలాఉన్నది మనం మాట్లాడటానికి. పెట్టుకున్న గడియలు దాటిపోతై. వాళ్లూ, వీళ్లూ వస్తారు. నీపని అయినతర్వాత ఇవన్నీ చెప్పుకోవచ్చు.

అమ్మ : ఇదంతా నాపనేగా! నా పనే కాకపోతే నేనింతసేపు కూర్చోలేను.

రాజమ్మ : నీ పని, నాపని ఇమిడి ఉన్నై.

అమ్మ : అవే భావా భావాలా?

రాజమ్మ : సరే.

అమ్మ : అడుగడుగునా సరే, సరే అంటారు. ఈ 'సరే'కు సరైన సమాధానంరావడం లేదు.

రాజమ్మ : మాటలతో రాదులే అమ్మా!

అమ్మ : నీ చల్లని చూపులతో వస్తుందా అమ్మా!

రాజమ్మ : పిచ్చి తల్లీ! పోయి తొందరగా......................

అమ్మ : మాట్లాడేవారు, చేయించేవారు వేరుగా ఉన్నట్లున్నారే!

రాజమ్మ : మాట్లాడేవాడే చేయించువాడు తల్లీ!

అమ్మ : ఇప్పుడు మీరు పొమ్మంటున్నారు, మరో శక్తియేదో ఉభయులనూ పోనివ్వకుండా ఆపుతున్నది.

రాజమ్మ : ఆగుతుంటే ఆగదూ.!

అమ్మ : నాకు మీరు చెప్పదగినవంటూ వేరేలేవు. ఈ వేరులూ, ఆ యేరులూ ఆ ఒక్క సముద్రములో చేరేటంతవరకూ రెండుగానే వుంటాయి. ఈ రెండింటికీ ఒకటేనని ఒకటిగాచూచి, ఒకటిగాచెప్పి, ఒకటిగావిని, ఒకటైతే అందటినీ నడిపిస్తాడువాడు. అంతవరకూ వట్టి వట్టి మాటలే. 'మనస్సును ఒక్కస్థాయిలో పెట్టించగల్గినదే మంత్రం'. అంటే ఒకస్థితి అనిగాదు. అన్నింటికీమనస్సే అంటే కాదు అర్థమయ్యేటట్లు చెప్పుకుందాం అసలు వేదాంతం చెప్పేవారికి, వినేవారికీ తెలియనిస్థితి చెప్పుకోవటం. చెప్పుకోవటం, వినటం, ఉన్నంతవఱకూ అది వేదాంతం కాదు.

రాజమ్మ : అవును, అంతే.

అమ్మ : ఇదంతా, అదే, సరే వెళ్లివస్తానమ్మా.

23-8-49వ తేదీ ఉదయం 7 గంటలకు ఇంటికి వెళ్లిన అమ్మ తిరిగి 9 గం. 20 ని. లకు నలుపు మచ్చలేని మ్రగ్గిన ఒకే హస్తానికి ఉన్న ఆఱు అరటిపండ్లు,

తమలపాకులు, వక్కలు, దక్షిణ తీసుకొని రాజమ్మ గారి దగ్గరకు వెళ్లి నమస్కరించి పండ్లు ప్రక్కన బెట్టి ఎదురుగా ఉన్న తాటాకుల చాపమీద కూర్చొన్న తర్వాత సంభాషణ మొదలయింది.

అమ్మ : అమ్మా! వంట అయిందా?

రాజమ్మ : ఎంత వంటలే అమ్మా!

అమ్మ : ఎంతవరకు పక్వమైతే అంతవఱకే.

రాజమ్మ : పక్వము మనము చేస్తేగా అమ్మా! ఎంతవఱకు అవసరమో అంతవఱకు చేసుకుంటాము.

అమ్మ : పోయిన పొడుగునా ఈ మాటలే అడ్డువస్తున్నాయి.

రాజమ్మ : ఏ మాటలు?

అమ్మ : మనం కొంత, దైవం కొంత

రాజమ్మ : సరేలే! వంటచేసి అక్కడ పెట్టి చెంబులతో నీళ్లు, పళ్లెము అన్నీ తెచ్చి పెడతాను. నీవు మడి కట్టుకో.

అమ్మ : మీరు చెప్పిన మడి కట్టుకుంటా.

రాజమ్మ : అదే! చీర ఇక్కడలేదుగా?

అమ్మ : మడి కట్టుకోవటానికి చీర ఆధారం కాదుగా, అందువల్ల చీరను గురించి ఆలోచనలేదు. మడి కట్టుకుండేదీ మడి కట్టించేదీ రెండు ఇక్కడే ఉన్నై. చీర మాత్రం లేదు.

రాజమ్మ : చీర లేని మడి ఏం మడి?

అమ్మ : చీరను ఏం చేస్తుంది మడి?

రాజమ్మ : చీరను పొడి లేకుండా తడిపి, పిండి, దానిపైన మడి నీళ్లు పోసి ఆరవేసుకుని కట్టుకుంటే అది మడి.

అమ్మ : మడి నీళ్లు పోయటానికి ముందు మడి కట్టాలిగా?

రాజమ్మ : పొరపాటు. ముందు పిండి అక్కడపెట్టుకొని, తర్వాత స్నానంచేసి బొక్కెనతో చేదెడు నీళ్లు తీసుకొని వచ్చి తడిసినదాకా పోసి ఆరవేసుకున్నది మడి.

అమ్మ : అదా మడి? ఆ స్థితి అంతా మనస్సుకే రావలెననుకున్నానమ్మా! మైల అంటే గుడ్డకు సంబంధించినంతవరకు పైన పోసే బొక్కెన నీళ్లు తప్ప తక్కినదంతా ఒకటిగానే ఉన్నది. మనస్సుకు సంబంధించినంతవరకు పై బొక్కెన నీళ్లు ఒక స్థితి కలగటంగా, తడపటం, ఆరవేయటం అంతా సాధనగా నేను అనుకుంటున్నానమ్మా!

రాజమ్మ : అయితే కావచ్చు.

అమ్మ : కావచ్చుననిగాని అంతేనని అనలేరా?

రాజమ్మ : అనలేకేం? దానికి అంతదూరం రాలేము. కొంచెము దోసకాయ తరిగి పెడతావు?

అమ్మ : కత్తిపీటలాంటివారు మీరుండగా తరగటానికి నాకేం?

రాజమ్మ : ఏమిటమ్మా? మళ్లీ అను.

అమ్మ : ఆఁ ఏమున్నది? మీరు కత్తిపీట. నాస్థితి దోసకాయ.

రాజమ్మ : తరిగేదెవరు?

అమ్మ : మీ లోని స్థితి, నాలోని స్థితి ఒక్కటైనా వేరువేరుగా ఉన్నాం గనుక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్కడి కక్కడే సాధకుడు, సాధ్యము ఏర్పడే ఉన్నవి. ప్రతి పనిలో ఇవి యిమిడే ఉన్నవి. కర్త, కర్మ, క్రియ – ఈ మూడు సర్వకాల సర్వావస్థలయందు పోల్చుకోగల్గినవారికి కర్త, కర్మే గురుశిష్య న్యాయము. అదే పరమాత్మకూ, జీవాత్మకూ తేడా అని నా అభిప్రాయము.

రాజమ్మ : చాలా తిరుగుడేనమ్మా నీతో.

అమ్మ : సృష్టి తిరుగుడు. అందులో నేనొక అణువును. ఆ అణువే ఈ సృష్టి.

రాజమ్మ : అంటే నీవేననా?

అమ్మ : ఆс. అంతే. అంటే మీరు నేనుగా వున్న ఈ అనసూయమ్మగాదు. నేను అనే నేను, నేను నేనేను అనే ఆ నేను, ఆ నేనే ఈ సర్వం.

రాజమ్మ : మిగిలినదేమిటి?

అమ్మ : మాటలు. అప్పుడు మాటలుపోతై. మాటలు పోతై అంటే సర్వం తానైన సంకల్పం మిగిలింది.

రాజమ్మ : ఇవన్నీ సరే. నేను ఆరవేసినది ఉన్నది. చుట్టుకొని చెప్పుకో.

అమ్మ : మీ గుడ్డ నేను చుట్టుకోవచ్చునా?

రాజమ్మ : నా గుడ్డ యేమిటమ్మా? ఫర్వాలేదు. రంగువేసినదేగా! కట్టుకోవచ్చు.

అమ్మ : మరి రవికో?

రాజమ్మ : సరే. నీ రవికెను పిండి తొడుక్కోకుండా ఒడిలో పెట్టుకో.

అమ్మ : రవిక ఒడిలో పెట్టుకోవటానికా?

రాజమ్మ : తడిదిగదూ!

అమ్మ : అప్పుడు దగ్గరలేకపోతే యేం?

రాజమ్మ : శాస్త్రం ఒప్పదు.

అమ్మ : శాస్త్రం అంటే ఇటువంటిదేనా? కొన్ని ఒప్పుకోవటం, కొన్ని ఒప్పుకోకపోవటమూనా? అసలు ప్రపంచమంతా తయారైనట్లే శాస్త్రంకూడా దానంతట అది తయారైనదా? ఎవరైనా వ్రాసినదా?

రాజమ్మ : అబ్బె! పెద్దలు అనుభవంమీద వ్రాసినది.

అమ్మ : అనుభవం సృష్టిలోనిది కాదా? కాగితాలు, కలాలు, సంకల్పం, కారణాలు అన్నీ ఒకటేననుకుంటా.

రాజమ్మ : కొండకు నాగలిపట్టి వేస్తావమ్మా!

అమ్మ : నాగలీ తెలియదు, కొండా తెలియదు. ఐనా పట్టించటానికి వీలయినప్పుడేగా పట్టించేది. ఆపని అనుకూలం కాకపోవచ్చుగాని పట్టించడం అంటూ ఉన్నదన్నమాట.

రాజమ్మ : అనుకూలమైతే పట్టించుకోవటం ఉండదుకదా అమ్మా!

అమ్మ : అనుకూలంలేని వాటినిగూడా చెప్పుకుంటున్నాముగా!

రాజమ్మ : అవునమ్మా! విసుగొస్తున్నది.

అమ్మ : మీకు విసుగేమిటి? ఆ విసుగే నాకిప్పుడు అవసరం.

రాజమ్మ : విసుగు నేర్చుకోవటానికి వచ్చావా? విసుగులేని మానవుడెవరు.

అమ్మ : దైవానికి విసుగుంటే గదా? దైవానికే లేని విసుగు మనకెట్లా వస్తుంది?

రాజమ్మ : వాడు సాక్షి అమ్మా!

అమ్మ : ఎవరికి సాక్షి? సాక్షికి నిర్వచనమేమిటమ్మా?

రాజమ్మ : నీకూ, నాకూ దేనికీ అంటనివాడు.

అమ్మ : అటువంటి వాడిని కొలవటమెందుకు?

రాజమ్మ : అంటని వాడనేగా కొలవటం.

అమ్మ : కొలిస్తేనేగాని అంటడా? దైవము మనకు అంటకుండా ఉండటానికా? అంటడానికా? మనకంటకుండా ఉండటానికా వాడిని కొలవటం? అప్పుడైనా అంటవలసిందేగా?

రాజమ్మ : ఏమోనమ్మా నీ సమాధానాలు! అర్థంకావు. అంతులేదు. తేలవు.

అమ్మ : అందుకేగా తమదగ్గరికి వచ్చింది. వాడిని కొలవటంకోసం రాలేదు మీ దగ్గరకు, నేనెవరో తెలుసుకోవటానికి మిమ్మల్ని కొలుస్తున్నాను.

రాజమ్మ : సరేగాని, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, ఆవుపాలు, అరటి ఆకు అన్నీ ఆ బీరువాలో ఉంచాను. పట్టుకురా.

అమ్మ : (యింట్లోకి వెళ్లి నాల్గుమూలల చూచి) బీరువామీద కనపడలేదమ్మా!

రాజమ్మ : అక్కడే వుంది. సరిగా చూడు.

అమ్మ : కనపడుతున్నంతవరకు చూచాను; కనపడలేదు. ఏ మూల వున్నది?

రాజమ్మ : ఎవరికయిన చెప్పేబదులు చేసుకోవటం మంచిది. (అంటూ రాజమ్మగారు లోపలికివచ్చి) అయ్యో! పొరపాటుపడ్డానమ్మా! ఇక్కడగాదు అవతల గదిలో ఉంటుంది.

అమ్మ : (ఆ గదిలోకి వెళ్లిచూచి) చెప్పినవాటిలో కొన్ని ఉన్నై, కొన్ని లేవమ్మా (అంటూ ఉన్నవానిని తీసుకొని) అమ్మా! ఎవరిది పొరపాటు అన్నారు. ఇందాక? పొరపాటంటే ఒప్పా? తప్పా? కావాలని అనటమా?

రాజమ్మ : గుర్తులేక చెప్పినమాటల కన్నానమ్మా!

అమ్మ : మీరన్నమాటకు కాదు. అసలు పొరపాటంటే యేమిటి?

రాజమ్మ : నీకసలు పొరపాటు కావాలి.

అమ్మ : అసలు పొరపాటుకే తిరగాలి.

రాజమ్మ : ప్రతిదీ నీకు ఇట్లా ఎందుకు తోస్తుందమ్మా!

అమ్మ : ' ఎవరికీ అంటని వాడిదయ '

రాజమ్మ : అంతే! అంతే! (అంటూ) అమ్మా కాలము గడచిపోయినది. తొందరగా పీట వేసి చెంబుతో నీళ్లు పెట్టిరా అమ్మా! దగ్గరకు రా! (అంటూ స్ఫటికాల దండ దగ్గర పెట్టుకొని) ఇంతకూ నీకు ఏ మంత్రం కావాలి?

అమ్మ : నాకు ఏ మంత్రం అవసరమని మీకు తోస్తే ఆ మంత్రం యివ్వండి.

రాజమ్మ : నీకు ఏద్దైవం ఇష్టం?

అమ్మ : ఇంతమంది దైవాలుండరని నా నమ్మకం. అయినా నీకు నాకు అంటని ఎవరితో సంబంధం లేనివాడు, పైగా వాడు సాక్షి అన్నారు. అదీగాక 'వాడు' అని చెబుతున్నారు, వాడు తప్ప అది కాదా?

రాజమ్మ : అయితే యింతకూ ఏమంటావు?

అమ్మ : ఏమన్నా అనటానికి కాదమ్మా. ఏమన్నా అనిపించుకోవటానికేగా వచ్చింది? అనిపించుకోవటం అంటే మీరు అన్నారనిగాదు, మీరు అనేది వినటానికని దాని అర్థం.

రాజమ్మ : ఇంతకూ నీకు అవసరమున్నదా? లేదా?

అమ్మ : ఇవన్నీ నా అవసరాలని నేను అడిగితే మీరు చేయడంలేదుగా! ఇవన్నీ నాకు అవసరమని మీరు గ్రహించి చేస్తున్నారేమో అనుకున్నాను. కాని ఇవన్నీ నా అవసరాలని ఇక్కడకు రాకముందు నేను అనుకోలేదు. ప్రతి పనీ జరుగబోయేముందు నాకు తోచిగాని, నాకవసరమనిగాని, మీరిట్లా చేస్తారనిగాని, చేస్తే బాగుండుననిగాని నాకేమీ తెలియటంలేదు. ఆలోచన లేదు.

రాజమ్మ : ఏడ్చినట్లుంది.

అమ్మ : ఏది యేడ్చినట్లుంది, జరిగిందా? జరుగబోయేదా? జరుగుతున్నదా? లేకనేనా?

రాజమ్మ : సరేనమ్మా! అన్ని గ్రంథాలలోకి ఏ గ్రంథం నీకిష్టం?

అమ్మ : గ్రంథాలంటూ చదివితే కొన్ని యిష్టం అంటూ చెప్పుదును. ఏదీ తెలియదు చదవనందువల్ల. అందులో ఏది ఉండేది తెలియదుగనుక, అన్నీ యిష్టమే.

రాజమ్మ : అయితే నా యిష్టమైంది చెపుతా.

అమ్మ : మీకు రెండుంటాయా? ముందుమీకు అయిష్టమైంది చెప్పి, తర్వాత ఇష్టమైంది చెప్పండి. ఇష్టమైంది చెప్పేవాళ్లు చాలామంది ఉంటారు. ఇష్టం అయిష్టం తెలియపరచేవాళ్లు మీబోటి తల్లులే. అంటే తల్లిగనుక. 'తల్లి' అంటే 'తొలి' అని నా ఉద్దేశ్యం. రెండూ మీలోనుంచే పుట్టినై గనుక రెండుగా కనపడి ఒకటిగా తోస్తే...........

రాజమ్మ : ఏమిటో అంతా మలప వ్యవహారం.

అమ్మ : మీరు ఏమ్మైనా చెప్పండి. నాకు ప్రతిమాటకూ, ప్రతిఅక్షరానికి వివరంగా మీరు చెప్పకపోతే ఇంకఎవరునాకు? అందరిమాదిరికాదు. మామూలుగా అనుకునే తల్లికూడా లేదు. ఎట్లా నడుచుకోవాలో తెలియక, ఇందాక మీరన్న పొరపాట్లతో జీవితం గడుస్తున్నది.

రాజమ్మ : అయితే ఇందాక నే నేమన్నానో కర్మం?

అమ్మ : కర్మమే! కర్మం అంటే?

రాజమ్మ : చేసేపని.

అమ్మ : అయితే చూసేదికాదా?

రాజమ్మ : ఇస్. చూసేదికూడా.

అమ్మ : కర్మకు ఇంకా చేస్తారా, అయిపోయింది. మీరు చెప్పబోయేదంతా ఇదేగా అమ్మా!

రాజమ్మ : అంటే.

అమ్మ : అంటే ఏదో మంత్రం చెపుతానంటిరే ఆ మంత్రం చెప్పుకుంటే తెలియనిదంటూ లేకుండా పోతుందా? తెలిసినదంటూ లేకుండా పోతుందా? ఈ రెంటిలో ఏద్దైనా యిష్టమే.

(ఇంతలో మాణిక్యం ' బామ్మా! తలుపుతీయి ' అంటారు.)

రాజమ్మ : ఇప్పుడు తలుపు తీయనే! ఎప్పుడుపడితే అప్పుడు వస్తారేం? (అంటూ) ఇకనైనా పని కానీ తల్లి!

అమ్మ : నాకున్నపని జరుగుతూనే ఉందిగా.

రాజమ్మ : ఏమిటి? ఈ మాటలకా?

అమ్మ : అచ్చగా నేనొకదాన్నే అయితే ఇంతకాలం జరుగదుగా ఈ సంభాషణ?

రాజమ్మ : అసలు నీదంతా అడవిగోడుగా ఉందే.

అమ్మ : అడవి గోడేగా? అడవిగోడంటే అర్థంకాకుండా ఉన్నదనేనా?

రాజమ్మ : ఆఁ..... నీ ముఖం, నా ముఖం.

అమ్మ : మన యిద్దరికీ ఉన్నాయిగా? ఒకరికి ఉండి ఒకరికి లేకుండా ఉన్నట్లయితే........

రాజమ్మ : సరేలే! ఇంతలో కాళ్లు కడుగమ్మా

ఆవుపాలతో రాజమ్మగారి పాదాలు కడుగుతూ

అమ్మ : కడగటంలో ఆవుపాలకూ నీళ్లకూ తేడా ఉంటుందా? లేకపోతే రెండింటితోనూ కడిగించడం ఎందుకు? ప్రతిదానికీ అర్థం చెపుతూ ప్రతిపనీ చేయిస్తుండమ్మా. అసలే నేను అడవి గోడునన్నారుకదా? ఆ అడవి అంతా మీ దగ్గర ఉండే గొడ్డలితో నరికేసేయండి.

అమ్మ మాటల్లోని అమాయికతా, అజ్ఞానమూ నిజమేననుకునీ తన ప్రతిభా, శక్తి సామర్థ్యాల గురించిన అమ్మ పొగడ్తకు పొంగిపోయి –

రాజమ్మ : అందుకేగా యిదంతా –

రాజమ్మగారిలోని అనవసరమూ, ఆధారరహితమూ అయిన పొంగునుచూచి అలా పొంగనివ్వడం శ్రేయస్కరం కాదనుకునేమో, పొంగుపై చన్నీళ్లుచల్లుతూ మనుషులతో, మనస్తత్వాలలో ఆటలాడుకొనడమూ, ఆటలాడించడమూ అమ్మకు సరదా.

అమ్మ : కంటికి అడవీ కనుపించడం లేదు. గొడ్డలీ కనుపించడం లేదు అంతా ఊహే.

అమ్మ మాటల్లోని అంతరార్థాల జోలికి పోవడం యిష్టం లేకనో, అంత లోతులకు వెళ్లే శక్తి చాలకనో ఆ విషయం వదిలేస్తూ, సంభాషణ మారుస్తూ తన గురుత్వం స్థిరపరచుకుసే తహతహతో --

రాజమ్మ : సరే – ఆవునెయ్యి వేసి కడుగమ్మా పాదాలు

బుద్ధిమంతురాలయిన శిష్యురాలివలె చెప్పినవెంటనే పాదాలు కడుగుతూ ఏమీ

తెలియనట్లుగా -

అమ్మ : ఈ జిడ్డు పోవటానికి ఏమిపెట్టి కడగాలమ్మా?

రాజమ్మ : తరువాత చూచుకుందాం. పెరుగుపోసి కడుగు.

అమ్మ : ఈ పెరుగుతో ఆ జిడ్డు వెనకపడిందికానీ, ఈ జిడ్డు పాముకున్నది... పెరుగు తర్వాత ఏమి పోయంటారు?

రాజమ్మ : వెన్న తెప్పించలేదమ్మా. అయినా యింత పొరపాటుపడ్డానేం? అసలు పంచామృతాలంటే ఇవి కావుగా ' తేనె, పంచదార, పాలు ......

అమ్మ : అసలు పంచామృతాలంటే యివి కనుకనే మీరు అనుకోకుండా అవి మరుగునపడి – మీరు కోరకుండానే ఇవి తటస్థపడ్డాయి.

రాజమ్మ : అసలు పంచామృతాలంటే ఇవేనా?

అమ్మ : నా ఉద్దేశ్యం యిది. ఒక అమృతంలోనుంచి పంచబడ్డవి కనుక పంచామృతాలనబడుతున్నాయి.

రాజమ్మ : ఎట్లా పంచబడ్డాయోకూడ వివరించమ్మా.

అమ్మ : పాలు, మీగడ, పెరుగు, వెన్న, నెయ్యి.

ఎన్నడూ వినని ఆ వివరణకు ఆశ్చర్యమూ ఆనందమూ పొందుతూ

రాజమ్మ : ఇంతవరకూ ఎవ్వరూ యీ మాట చెప్పలేదమ్మా, శాస్త్రాలలో కూడా యీ మాట లేదు.

అమ్మ : అందుకేగా అమ్మా నా అభిప్రాయమన్నది.

రాజమ్మ : అయినా, సాయంకాలం ఇనుపకుతికెల శంకరశాస్త్రిగారి దగ్గర యీ సంగతి తేలుద్దాము.

ఏ విషయమయినా శాస్త్రం చెప్పితే కాని ఒప్పు కొనని మనస్తత్త్వం రాజమ్మ గారిది. ఏ విషయాన్నయినా సిద్ధాంతీకరించగల, ఏ అంశంగురించి అయినా స్వయంగా ఆలోచించి అభిప్రాయం ప్రకటించగల అనుభవం అమ్మకున్నది. అందువలననే అన్నది–

అమ్మ : దీనిని శంకరశాస్త్రిగారు తేల్చాల్సిన అవసరమేమున్నదమ్మా!

రాజమ్మ : వారు బాగా చదువుకున్నవారు. సంస్కృత పండితులు, సందేహనివృత్తి చేయగలిగినవారు.

అమ్మ : ఎవరి సందేహాలు?

రాజమ్మ : అందరి సందేహాలు తీర్చగలవారే.

అమ్మ : సందేహాలు లేని మానవులూ లేరు. తీర్చే మానవులూలేరు, ఎన్నితీరినా ఏవో మిగులుతూనే ఉంటాయి.

రాజమ్మ : అయినా ఆయనను అట్లా అనకూడదమ్మా. ఆయన దైవమువంటివాడు.

అమ్మ : అంటే సాక్షి అనా? ఏదీ అంటనివాడనా? – అయితే ఎట్లా తీరుస్తాడు?

రాజమ్మ : పండితుడే భగవంతుడమ్మా.

అమ్మ : రకరకాలుగా చెబుతుంటారమ్మా. మీరు చెప్పేదంతా నన్ను నమ్మించినాసరే. నా మనస్సుకు యేదీ తోచకుండా చేసినాసరే. సందేహ నివృత్తి చేసినా సరే.

రాజమ్మ : అసలు పెద్దలంటే నమ్మకముంటేగా?

అమ్మ : పెద్దలు అంటే ఏముంటుంది? ఉంటే ఉంటుంది.

రాజమ్మ : పెద్దలే లేరా?

అమ్మ : ఉన్నారు. లేరు అనే మాట లేదు నేనన్నదానిలో.

రాజమ్మ : నీదంతా, యిదంతా ఒక విపరీతమయిన సమావేశంగా కనుపిస్తున్నది నీ వర్చస్సులోనే మార్పు ఉన్నదమ్మా.

అమ్మ : వర్చస్సంటే ఎట్లైనా గావచ్చు. ఏరకంగా ఉన్నది?

రాజమ్మగారు కన్ను ఆర్పకుండా అమ్మవంక చూస్తూ ఉన్నది. ఆమెలో యేదో కదలిక ఆరంభమయినట్లున్నది. కొన్ని క్షణాలట్లాచూచి, కొన్నిక్షణాలు ఆలోచించి

రాజమ్మ : చెప్పగలిగితే యింకాయేం? కదలకుండా కూర్చో అమ్మా -

అమ్మ : కదలకుండా ఎట్లా కడిగేది?

రాజమ్మ : కడుగుతూ నా వంక చూస్తుండమ్మా.

అమ్మ : క్రింద కనపడవద్దూ - పాదాలు.

రాజమ్మ : చేతికి తగలవా?

అమ్మ : చేతులకందవు పాదాలు.

రాజమ్మ : ఏమిటందవు?

అమ్మ : మీరు కడగమన్న వస్తువులందవు.

సంభాషణలో కాలం వ్యర్థం అవుతున్నట్లు తోచింది రాజమ్మగారికి తను పొందబోతున్నది యీ మాటల మాటున దూరమవుతున్నట్లు అనిపించి -

రాజమ్మ : అమ్మా! తరువాత ఆలోచిద్దాం. ఊ - కదలకు.

అమ్మ : నీవు వదలకు

రాజమ్మ : ఉష్ - అబ్బా - ఉండమ్మా -

అమ్మ : ' ఉండనా ' అమ్మా?

రాజమ్మ : ఒక్కమాటలోనే అర్థం మార్పు చేస్తావేమమ్మా?

అమ్మ : అవకాశం ఉన్నది గనుక.

రాజమ్మగారు అమ్మ ముఖం వంక అట్లాగే చూస్తూ ఉన్నది. తను యెన్నడూ చూడని అనన్య తేజస్సూ అద్భుత దృశ్యమూ దృగ్గోచరమవుతున్నవి. శరీరం పులకించింది. కన్ను చెమర్చింది. కంఠం గద్గదిక మయింది.

రాజమ్మ తల్లీ! తల్లీ!! అన్నపూర్ణేశ్వరీ!!! పాదాలమీద చెయ్యితీయి అమ్మా - అని 'అమ్మలగన్న అమ్మ........' అన్న పద్యం చదువుతూ అమ్మా! నన్ను ఏదో త్రాసులో పెట్టి తూస్తూ, సిబ్బి ఒకవైపుకు వంచుతూ లేస్తూ ఉందమ్మా.

చేతులు రాజమ్మగారి పాదాల మీదనే ఉంచి

అమ్మ : ఏరకం రాయి వేశారమ్మా తూకానికి?

రాజమ్మ : రాయి కనుపించడం లేదమ్మా!

అమ్మ : త్రాసు అని ఎందుకు తోచింది?

రాజమ్మ : అమ్మా! ఏమి చెప్పుకోలేని స్థితిగా ఉంది.

అంటూ ఉండగానే తడబడే మాటలు కూడా కట్టుబడినయ్. కన్నులు మూసుకున్నయ్. అమ్మ మౌనంగా రాజమ్మగారి వంకనే చూస్తూ ఉంది. దాదాపు పదిహేను నిమిషాలు గడిచాయి.

ఆ పదిహేను నిమిషాల్లో అమ్మలో ఏమి అద్భుతం చూచిందో, ఏమి అనుభవం పొందిందో రాజమ్మగారిలో అమ్మకు తాను గురువుననిపించుకోవాలనే కాంక్ష తీవ్రమయింది. ఈ అవకాశం జారవిడుచుకుంటే కలగబోయే ఒక అనశ్వరమయిన మహాభాగ్యాన్ని తాను నష్టపోయినట్లవుతుంది. తాను అంత తెలివి తక్కువ మనిషికాదు. అందువల్లనే ఒక నిశ్చయానికి వచ్చి –

రాజమ్మ : అమ్మా! పాదాలు కడిగివేసెయ్యి. అన్నం పెడతాను.

అమ్మకు ఆశ్చర్యం కలిగింది. కాని అమ్మకు ఎప్పుడూ ఏ భావమూ ప్రకటించడం అలవాటూ యిష్టమూ లేదు. అందువల్లనే నిర్లిప్తంగా అన్నది.

' అన్నం తినమంటారా '

రాజమ్మగారికి అర్థంకాక అడిగింది.

' అన్నం తినవా అసలు? '

విధి నిషేధాలకు అతీతఅయిన అమ్మ వెంటనే అన్నది:

' తినను అని లేదు '

రాజమ్మ : సందిగ్ధా వస్థలో పెట్టావమ్మా.

అమ్మ : సందిగ్ధావస్థలో పడ్డాను.

రాజమ్మ : ఎందువల్ల?

అమ్మ : అన్నీతెలిసిన అమ్మ నన్ను యిట్లా అడుగుతుందేమా అని –

అశ్రుపూరిత నయనాలతో, అనుభూతి అందించిన ఆవేశంతో ' అమ్మా! అన్నపూర్ణా!! '

– అని పిలుస్తూ అంతలోనే కర్తవ్యమూ, కార్యక్రమమూ స్ఫురణకు వచ్చి –

రాజమ్మ : పెసరపిండితో జిడ్డు కడుగమ్మా.

అమ్మ : జిడ్డు సంస్కారంకదా. అట్లాంటి సంస్కారం పెసరపిండితో కొట్టుకుపోతున్నది.

అంటూ అమ్మ రాజమ్మగారి పాదాలు కడుగుతూ ఉండగా ఆ నీటిపై జిడ్డు కనుపించింది. అప్పుడు మళ్లీ అమ్మే అన్నది.

ఇక్కడ జిడ్డు పోయి నీటిపై కనుపిస్తున్నదమ్మా. జిడ్డు అంటూ ఉంటే యెక్కడయినా ఉండేదే '.

ఈ సంభాషణ యేమీ పట్టనట్లుగా – మనసులో రేగిన కల్లోలానికి కలిగిన అయోమయావస్థకూ మాటల రూపం యివ్వడానికి ప్రయత్నిస్తూ –

రాజమ్మ : అమ్మా: ఏమిటోనమ్మా ఏమీ తోచడంలేదు. నీవు ఎవరో అర్థం కావడం లేదు; నీవు ఎందుకు వచ్చావో తెలియడం లేదు; ఏమిచేయాలో తెలియడంలేదు; అటూ ఇటూ రెండువైపులా గుంజుతూవుంది.

అని పెద్ద పీటవేసి ఆరు అరటి ఆకులు కలిపి కోణాలుగా ఒకటిగా వేసింది. మధ్యలో అన్నం పెట్టింది చుట్టూ 32 పదార్థాలు వడ్డించింది. ఆవు పెరుగు అన్నం మధ్యలో పోసింది. అరటిపండు, చింతపండుతో కలిపి, తేనెవేసి కొద్దిగా ఉప్పువేసి తిరగమోత వేసిన పదార్థం ఒక ప్రక్కన వడ్డించింది. తులసి కోటలో కొన్ని దళాలు కోసుకురమ్మనమని అమ్మను అడిగింది. అమ్మ దళాలు కోస్తూ – ' నేను ఏదళం వేసుకు పుట్టానో యీ దళాలు కోస్తున్నాను '. అంటూ లోపలకు వస్తూ ఉంది. దళాలతోపాటు తులసికొమ్మకూడ చేతిలో వుంది. అంతలో రాజమ్మగారి మాటలు అస్పష్టంగా వినిపించి అమ్మ అడిగింది:

'ఏమమ్మా! ఏమిటి అంటున్నారు?'

రాజమ్మ : దళాలు కోసేటప్పుడే కొమ్మకూడా వచ్చిందా? మధ్యలోకి వచ్చినతర్వాత కొమ్మ అయిందా?

అమ్మ : అసలు ఆ సందేహం ఎందుకువచ్చిందమ్మా? నేను రెండూ గుర్తించలేదు.

రాజమ్మ : సరే, రా. నా చేతిలోపెట్టు అవి. కాదు, కాదు. హరివాణంలోపొయ్యి కనపడ్డదా? – రావిది.

అమ్మ : రావిదా? రాగిదా?

రాజమ్మ : రెంటికీ తేడా ఉందా?

అమ్మ : మాటలో తేడా కనుపిస్తున్నదిగా. అక్షరం తేడా ఉన్నప్పుడు అర్థం తేడా ఉంటుందిగా.

రాజమ్మ : చెపుతావా అమ్మా?

అమ్మ : సాయంకాలం ఇనుపకుతికెల శంకరశాస్త్రిగారు వచ్చినపుడు చెప్పుకుందాంలే.

రాజమ్మ : రా, అమ్మా కూర్చో – ఉదకం పట్టు.

అని మూడుసార్లు నీరు చేతిలో పోసి కేశవనామాలు చెప్తూ ఆచమనం చేయించి అమ్మను సంకల్పం చెప్పుకోమన్నది.

అమ్మ : సంకల్పం చెప్పుకునేది కాదు; కలిగేది. చెప్పుకునే సంకల్పం కలగలేదు. సంకల్పం కలిగిందా.

రాజమ్మ : ఏమి సంకల్పం?

అమ్మ : జరుగుతున్న ప్రతి పనికీ

రాజమ్మ : కాదమ్మా – ఉత్తిష్ఠంతు భూత పిశాచా: .... చెప్పుకో భగవంతుని దగ్గర మన గోత్ర నామాలు తెలియపరచుకోవడమే సంకల్పం.

అమ్మ : ఆ అనుకోవడానికి కూడ సంకల్పం ఉండాలిగా – మరి, వానిసన్నిధి యిక్కడలేదుగా. మీ సన్నిధిలో ఉన్నాను. మీకన్నీ తెలుసు.

రాజమ్మ : సరే! నాకేది యిష్టమో ....

అని కాదనుకుని

నీకేది యిష్టమో ....

అని అడుగుతూ

ఏది యిష్టమైతే యేమిలే – ముందు గురుధ్యానం చెప్పుకో –

అమ్మ : ఇక్కడ చాలా మాట్లాడవలసి ఉంటుంది. మాట్లాడుదామా: ఆపేద్దామా? – మీదయ.

రాజమ్మ : సరే. తరువాత – ముందు చెప్పుకో.

అమ్మ : చెప్పుకోటానికే అడగటం.

రాజమ్మ : నేను చెప్పుతాను. ఒక్కమాట అను. తరువాత ఆలోచిద్దాం.

అమ్మ : ఆఁ – ' ఒక్కమాట '

రాజమ్మ : ఆఁ! అదేచాలా?

అమ్మ : చతురక్షరమా. విడదీస్తే ఆరు అక్షరాలున్నాయి ఎన్నిఅయినా అవుతాయి. రాజమ్మగారికి కొంచెం విసుగుకలిగి అన్నది:

' ఎన్ని అయినా చేస్తావు – '

అమ్మ : వచ్చినపనీ, మీరిచ్చినపనీ అందరూ మెచ్చేదిగా ఉండాలి మెచ్చడం అంటే అందరూ మన దగ్గరకు వచ్చి అంతా బాగుందనటం కాదు. ముందు ముందు యీ సమావేశం యొక్క ప్రయోజనం మనకు మాత్రమేకాదు, మన అందరికీ ....

అమ్మ దూరదృష్టికి రాజమ్మగారు ఆశ్చర్యపోయి అన్నది:

' ఏమిటమ్మా? బ్రహ్మాండంగా పలికావు! '

అమ్మ నిర్లిప్తంగా అన్నది:

' బ్రహ్మాండమేగా. '

అమ్మ పలికే ప్రతి మాటా జ్ఞాన ప్రసూన పరిమళాలు వెదజల్లుతున్నా నాసికకే కాని మనసుకు పట్టని రాజమ్మగారు అమ్మ మాటల్లోని చమత్కృతికి మాత్రం ముగ్ధురాలవుతూ తనస్థాయిని గగన వీధుల్లో ఊహించుకుని అన్నది:

' అమ్మా! ఒక రెండు సంవత్సరాలు నీవు నాదగ్గర ఉంటే –

అమ్మ : ఒక రెండు ఏమిటి? ఒకటి రెండనా? రెండూ ఒకటేనా?

ఒకసారి చెప్పటం చేత అట్లా అన్నారా?

పేకమేడలో అడుగుముక్క లాగితే మేడ కుప్పకూలి పోయినట్లు అంతలోనే చప్పగా జారిపోయిన రాజమ్మగారు:

' ఏమి మాట్లాడాలో తెలియటంలేదు తల్లీ – ' అని అమ్మ ముఖంలోకి చూచింది.

అమ్మ : నాతోనా అమ్మా?

అని అమ్మ అడుగుతుండగానే ఆ వదనమండలంలో దివ్యప్రభలు వెలుగుతున్నా అర్థం చేసుకోలేని రాజమ్మగారు అమాయికంగా అడిగింది:

' నీ ముఖాన పెట్టుకున్న కుంకుమలో తళుకు కలిపావా? '

అమ్మ : నా కుంకుమే తళుక్కు మనవచ్చు. నా కుంకుమలో తళుకు కలుపలేదు.

రాజమ్మ : కుంకుమకూ, బొట్టుకూ అర్థం కావాలమ్మా!

అమ్మ : దేనికి అక్కర లేదు?

ఔను దేనికి అక్కరలేదు? అన్నిటికీ కావాలి. అవన్నీ పెట్టుకు కూర్చుంటే ప్రస్తుత కార్యక్రమానికి విఘ్నం కలుగుతుంది. కనుకనే రాజమ్మగారు ఆ'తీగ'ను అంతటితోనే వదిలేసింది.

' కూర్చో అమ్మా. తూర్పునకు తిరుగు. ముఖం త్రిప్పు. తులసిదళాలు అన్నంపైన

వెయ్యి – '

అని రాజమ్మగారు అన్నం పైకితీసి గోపురంలాగ తయారు చేసి –

' అమ్మా ! వేసిన పదార్థాలలో నాకు ఏది యిష్టమో కలుపు తల్లీ!'

అమ్మ ఏమి ఆలోచించకుండానే వెంటనే చేతికి వచ్చిన పదార్థాన్ని తీసుకుని కలుపగానే సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయిన రాజమ్మగారు ఆవేశపూరిత కంఠంతో ' అమ్మా! అమ్మా!! ' అని అరిచి అడిగింది.

' నేను నీకు పెట్టేదా? లేక నీవు నాకు పెడతావా? '

అమ్మ : నేను తిననిది మీరు పెట్టలేరు. మీరు పెట్టింది నేను తినలేను. కాని మీచేత పెట్టించుకోవటానికి వచ్చాగాని మీకు పెట్టడానికి రాలేదు.

అమ్మ వాక్చమత్కృతికీ, తర్కవైభవానికీ, ఆ రెంటి వెనక దోబూచులాడుకునే జ్ఞానరోచిస్సులకూ విస్తుపోతూ తదేకదీక్షగా అమ్మ ముఖంలోకి చూస్తూ, వింతకాంతులను గమనిస్తూ, ఏదో అనిర్వచనీయమయిన అనుభూతిని పొందుతూ, ఏనుగు దిగిన సరోవరంలాగ మనసు సంచలితంకాగా అంతలోనే కన్నులశ్రుపూరితమై, కంఠం గద్గదికమై రాజమ్మగారు అన్నది:

' ఇంతకు ముందేమైనా సాధన చేశావా? ముఖవర్చస్సు చామంతి రంగులో గులాబి కలిసినట్లున్నది. మధ్య మధ్యలో మొగలిపువ్వు రంగు కనుపిస్తున్నది. '

అమ్మ : నా రంగు నాకు తెలియడంలేదు. తెలిసి చేసిన సాధనంటూ లేదు.

రాజమ్మ : సాధన అంటే తెలిసి చేసేదమ్మా.

అని అమ్మ తల తన గుండెలకు హత్తుకున్నది. చేతులతో చెంపలు నిమురుతుండగా కన్నీళ్లు అమ్మతలమీద పడ్డయ్. ఆనీరు వెచ్చగా ఉన్నట్లనిపించి అమ్మ రాజమ్మగారి కళ్లమీదకు చేయి పోనిచ్చింది. అక్కడ నీరు చల్లగా ఉంది. మరి యీవేడి ఎక్కడిది? తన తలలోనిదా? ఆమె కంటి లోనిదా? – అని ఆలోచించి ఆమె నీరు ఎప్పుడూ ఒకటే, తన తలలోని చల్లదనం వల్ల వెచ్చగానూ, చేతి వెచ్చదనం వల్ల చల్లగానూ ఉన్నదని అమ్మ

అనుకొన్నది.

రాజమ్మగారు ' అమ్మా, అమ్మా ' అంటూ గుండెలకు హత్తుకున్న అమ్మ తలను వెనక్కునెట్టి అడిగింది:

' ఆ కలిపిన ముద్ద నీ చేతిలో పెడతాను; తినమ్మా '

అమ్మ : చేతిలోనా? నోటిలోనా?

రాజమ్మ : నీకేది యిష్టం

అమ్మ : అసలు ముద్ద ఎందుకు అవసరమో తెలియదుకదా. పెడతానంటున్నారు కనుక చేతిలోకన్నా నోటిలో పెడితే మ్రింగవచ్చునుకదా అనుకున్నా.

రాజమ్మ : పోనీలే. ఇద్దరమూ కలిసి తిందామమ్మా.

అమ్మ : ఇద్దరమూ కలియడమంటే? ఒకే విస్తట్లో ఎవరి చేతికి వచ్చింది వారు తీసుకుని తినడమా? లేక ఒకరు తింటే మరొకరికి నిండడమా? రెండు లేకుండా పోయి ఒకటై తినడమా?

రాజమ్మ : కలియక అంటే నా దృష్టిలో ఎంగిలి భేదం లేకపోవడం.

అమ్మ : ఎంగిలి అంటే అంగిలి కంటినదే కదమ్మా.

రాజమ్మ : అబ్బా! ఏమి సమాధానాలమ్మా! దొర్లుతాయా!

అమ్మ : ఎక్కడనుంచి దొర్లుతాయి? దొరలటమంటే ఎత్తునుంచి పల్లానికేగా, అయితే మీబోటి మేరుపర్వతాల్లాంటి తల్లులు మాబోటి వారిద్వారా పలికిస్తూ ఉంటారు.

రాజమ్మ : సరే – అన్నిరకాల పదార్థాలువేసి అన్నమంతా కలిపేసెయ్యి. ముద్దలు చేసుకుని యిద్దరమూ తిందాం. మరిచేపోయినానమ్మా. ఇందాక నీవు పెట్టనిది నేను తినలేను. నేను తిననిది మీరు పెట్టలేరు – అంటివే? అట్లా కాకుండా యిద్దరం కలిసి ఒకే పర్యాయం తినే

ఉపాయముంటే చెప్పు.

అమ్మ : ఉపాయం చెప్పించుకోడానికేగా వచ్చింది.

రాజమ్మ : బోర్లపడుకుని నీవు పైగోపురం కొరుక్కుతిను.

అమ్మ : నేను తింటే మీరు తిన్నట్లవుతుందా? నేను కొరుక్కుతింటే మీ కడుపు నిండుతుందా?

రాజమ్మ : ముందు నీవు తింటే తరువాత నేను కొరుక్కుతింటా అమ్మా.

సాంప్రదాయానుసారం ఉపదేశం యిచ్చే సమయంలో గురువు ఉచ్ఛిష్టం శిష్యునిచేత తినిపిస్తాడు. అన్నం బ్రహ్మస్వరూపం కనుక గురువు మొదట అనుభవం పొంది దానిని శిష్యునికి పంచియిస్తాడు. అదేపద్ధతిలో రాజమ్మగారు అంతా ఏర్పాటు చేసింది. మధ్యలో యిద్దరమూ కలిసి తిందామన్నది. చివరకు అమ్మనే మొదటగా తినమన్నది. తర్వాత తను తింటానన్నది.

అమ్మ : మీరు బోర్లపడుకుంటే - కాళ్లు వత్తుకుపోతయ్యమ్మా. అసలే ఆయాసం, ఎంగిలి భేదమనేగా మీరు చెప్పింది. ముందు ముద్ద మీరు చేతికి తీసుకుని కొరుక్కుతిని నాకు పెట్టండి. తర్వాత మీరు ఏది చెప్పితే అది చేస్తాను.

ఎంత అనుభవం పొందినా, సాంప్రదాయంకోసం ప్రాకులాడే రాజమ్మ గారిని ఆ గాడి నుండి తప్పించడం యిష్టంలేకనూ, ఆమె దారిలోనే ఆమెకు ప్రబోధం యివ్వవలెననీ అమ్మ అభిమతమయి ఉంటుంది.

రాజమ్మ : అమ్మా! ఈ ముద్దతినడమూ, గురుధ్యానం చేసుకొనడమూ ఒకేసారి అయితే బాగుంటుందేమో........

అమ్మ : కొరుకుతూ చెపుతారా? మీరు కొరికేటప్పుడు మిమ్ములను ధ్యానించమంటారా? ధ్యానమంటే ఏమిటో చెప్పలేదుగా?

రాజమ్మ : అంటే - ముద్దచేతిలో పెట్టుకుని ధ్యానశ్లోకం చెపుతాను. ముద్దమ్రింగి

ఆధ్యానశ్లోకం పఠిద్దువుగాని.

అమ్మ : ఆ ముద్దలో యీశ్లోకసారమిముడుతుందా?

అసలు సాంప్రదాయంయొక్క ఉద్దేశం అదే. కాని అది కేవలం అలవాటుగా మాత్రమే మిగిలిపోయింది. రాజమ్మగారికి ఆ విషయం చెప్పి అసలు ఉద్దేశం గుర్తుచేసింది. కాని రాజమ్మగారికి ఆ విషయం మనసుకు పట్టినట్లులేదు.

రాజమ్మ : శ్లోకమే వినకపోతివి. శ్లోకసార మిముడుతుందా అని అడుగుతుంటివి.

అంటూ అమ్మ ముఖంలోకి చూచింది. మరిఏమి కనుపించిందో, కళ్లు పెద్దవిచేసి నిశ్చేష్టురాలయింది అమ్మ దృష్టికూడా వారిదృష్టిలో లీనంచేసింది. అరగంట గడిచింది. రాజమ్మగారికి స్మృతి కలిగేటప్పటికి – చెక్కిళ్లమీదగా కన్నీళ్లు ధారలు కట్టి ఉన్నయ్. ఎదురుగా ఏమి తెలియనట్లు అమ్మ మౌనంగా కూర్చుని ఉన్నది. అరటి ఆకులు అట్లాగే ఉన్నయ్; అందులో అన్నమట్లాగే ఉన్నది: పదార్థాలట్లాగే ఉన్నయ్. చుట్టూ వాతావరణం మామూలుగానే ఉన్నది – కాని తన శరీరంలో యేదో మార్పు జరిగినట్లున్నది. తన మనసు మాత్రం ఒక కొత్తలోకమూ కొత్త దృశ్యమూ చూచి వచ్చింది. మళ్లీ అమ్మవంక చూచింది. అమ్మ తనవంకనే చూస్తున్నది. ఆ చూపులో అమాయకత మాత్రమే కనుపిస్తున్నది. రాజమ్మగారు కారే కన్నీళ్లు తుడుచుకుని కంఠం సవరించుకున్నది.

‘ ముద్దను నా నోటిదగ్గర పెట్టమ్మా ’

అమ్మ నోటికి అందించింది. కొరుకుతూ చెప్పింది:

‘ గురుర్బ్రహ్మా గురుర్విష్ణు......... ’

అమ్మ : గు....రు....ర్బ్ర.....హ్మా – అంతవరకు చాలమ్మా

రాజమ్మ : పోనీ, యీ ముద్ద నోటిలో పెట్టుకో. తరువాత మాట్లాడుదాం.

వెంటనే ఆ ముద్దను నోటిలో పెట్టుకుని –

అమ్మ : ఈ అన్నపూర్ణతల్లి ముద్దతో పరిపూర్ణత పొందుతానా అమ్మా?

రాజమ్మ : పరిపూర్ణత అంటే ఏమిటమ్మా?

అమ్మ : సర్వత్రా భిన్నత్వం లేకపోవడమేనమ్మా?

ఆ నిర్వచనానికి ఆనందపడి –

రాజమ్మ : సర్వత్రా అంటే వివరించుతల్లీ.

అమ్మ : ఇప్పుడు మీరు ముద్ద నోటిలో పెట్టారు. అబ్బాయి నోటిలో ముద్ద తింటున్నాను.

అప్పుడు అమ్మ చిన్న కుమారుడయిన రవి ప్రక్కనే ఉన్నాడు. అతనికి మూడు సంవత్సరాల వయస్సు. అమ్మ అతని నోటిలో ముద్దపెట్టి అతనిచేత కొరికించి తిరిగి ఆముద్దను తీసుకుంటూ ఉండగా ఒక పిల్లి వచ్చి ఎగబడి ఆ ముద్దను కొరికింది. ఒక ప్రక్కగా ఎరుపు, తెలుపు, నలుపు మచ్చలుగల రాజమ్మగారి పెంపుడుకుక్క వచ్చి విస్తట్లోవున్న అన్నంమీద పడ్డది. పిల్లికొరికిన అన్నమూ, కుక్క తిన్న అన్నమూ, కలిపి ముద్దచేసి అమ్మ నోటిలో పెట్టుకున్నది.

' అయ్యో, అయ్యో... ' అని రాజమ్మగారు అరిచింది.

అంతలో వాకిట్లోనుంచి –

' అమ్మా! మధుకరం .....'

అన్న కేక వినిపించింది.

అమ్మ : అమ్మా! బిచ్చగాడు వచ్చాడు.

రాజమ్మ : తలుపు తీయమ్మా. బిచ్చగాడు కాదులే. బ్రాహ్మణ వటువు; రోజూ వస్తాడు.

అమ్మ : రోజూవస్తే బిచ్చగాడుకాడా? బ్రాహ్మడయితేకాడా?

అడుగుతూ అమ్మ వెళ్లి తలుపుతీసి చూచి–

మీరన్నట్లుకాదు. వాడు మామూలు బిచ్చగాడేనమ్మా.

రాజమ్మ : సరే అన్నం తీసుకుని వెళ్లి వెయ్యమ్మా.

విస్తట్లో అన్నం చేత్తోపట్టుకుని అమ్మ బయటకు వెళ్లి బిచ్చగానితో ' పట్టునాయనా ' అన్నది. అతను చేతిలో ఉన్న బిడ్డను క్రిందికిదించి జోలెలో ఉన్న గిన్నెతీసి పట్టుకున్నాడు. అమ్మ అన్నం వేస్తూఉండగా పిల్ల ఆశకొద్దీ అతని చేతిలోని గిన్నెలాగింది. గిన్నెతో పిల్ల క్రిందపడి కెవ్వుమన్నది. అమ్మ ఆ పిల్లను ఎత్తుకొని సముదాయిస్తూ లోపలకు తీసుకుని వచ్చింది. ఆ పిల్లను చూచి ఉలిక్కిపడి –

రాజమ్మ : అయ్యో! పిల్లను లోపలకు తీసుకువచ్చావేం?

అమ్మ : చేతిలోముద్ద పిల్లనోటిలో కొంతపెట్టి మిగతాది అమ్మతిన్నది. రాజమ్మగారి ముఖం అసహ్యతా స్ఫోరకంగా మారింది. – ' ఇంతకూ ఎవరూ యీపిల్ల ' అంటూ బయటకు వచ్చింది. బిచ్చగాడిని చూచింది. పాకీవాడు! నోటినిండా అన్నం కుక్కుకున్నాడు.

' ఓరీ! నీవటరా – హరిహరీ .... ఇన్నాళ్లనుంచి కనుపించడం లేదేమిరా? ఇవ్వాళే వచ్చావు నీవు – '

నే...నే... దొర...సానమ్మా

మాటలుకూడా సరిగా రానంతగా నోటినిండా అన్నమున్నది. అమ్మకూడా పిల్లనెత్తుకుని బయటకు వచ్చింది.

రాజమ్మ : వాడి కడుపాత్రంచూడు –

అమ్మ : కడుపాత్రం కాదమ్మా – ఆకలి. దాని ప్రభావం మీకు తెలీదు.

రాజమ్మ : దొడ్డిచిమ్మడానికి రావడం లేదేమిటిరా?

బిచ్చ : బొత్తిగా మీపాకీది లెగవడం లేదండీ.

అమ్మ : మీ అమ్మాయిదుగో, ఏడుస్తున్నది – తీసుకో.

బిచ్చ : పిల్లమాట మరిచేపోయాతల్లీ. గిన్నెనిండా బువ్వపెడితివి. పొట్టనిండె.

అమ్మ పిల్లను వాడికి అందించింది వాడు ' క్రిందదించమ్మా ....' అన్నాడు. పిల్ల అమ్మ భుజం గట్టిగా పట్టుకుని వదల్లేదు. అమ్మ పిల్ల రెండు రెక్కలూ పట్టుకుని

వాడిచేతుల్లో ఉంచింది. రాజమ్మగారి కన్నులు ఎర్రబడ్డాయ్. సహజమయిన గుణం చావదు. మరి!

రాజమ్మ : కొంపతీసి వాడిపిల్లేనా యేంటి?

కోపంవల్లనో, బాధవల్లనో. ఆమె కంఠం వణికింది.

అమ్మ : క్రిందపడి ఉంటే తీసుకువచ్చా. వాడిపిల్ల అవునో, కాదో తెలీదు. అప్పుడు నాపిల్ల అనిపించింది. ఎత్తుకున్నాను.

మనసులాగా అమ్మ మాటకూడా నిర్వికారంగానే ఉన్నది.

రాజమ్మ : ఇప్పుడూ..........

అమ్మ : ఇప్పుడుకాదని కాదు.

రాజమ్మ : మరి ఎందుకు దించుతున్నావు?

అమ్మ : నాపిల్లలయినా ఎప్పుడూ నాదగ్గరే ఉండటం లేదుగా? మనసులో ఎప్పుడూ నాదగ్గరే ఉంటారు.

రాజమ్మ : అయితే అందరూనా?

అమ్మ : నేకన్నంత వరకు.

రాజమ్మ : ఇంతకూ ముగ్గురినేగా నీవు కన్నది?

అమ్మ : అవును, ' మూడే '

రాజమ్మ : మూడే యేమిటి?

అమ్మ : మూడు కాలాలు, మూడు అవస్థలు, ముగ్గురు మూర్తులు.

రాజమ్మ : అయితే సృష్టంతా నీదేనా?

అమ్మ : సృష్టి అనాది; నాది

అమ్మ మాటలో గాంభీర్యమూ, అధికారమూ తొణికిసలాడినయ్.

రాజమ్మ : ఏమి విచిత్రమయిన సంభాషణ తెచ్చిపెట్టావు తల్లీ. సంభాషణ ఆనందంగా ఉన్నది. పరిస్థితులు బాధగా ఉన్నాయ్.

అమ్మ : పరిస్థితులబట్టే సంభాషణగదా. దానికి బాగు. దీనికి ఓగు ఏమిటి?

రాజమ్మ : ధర్మవిరుద్ధంగా కనపడుతున్నయ్యమ్మా కొన్ని. కడుపులో మంటగా ఉన్నది.

అమ్మ : శరీరమంతా లేదుగా.

బిచ్చగాని కంఠం బయటనుండి వినిపించింది:

' దొరసానీ: వెళ్లివస్తానమ్మా '

రాజమ్మ : ఇంకా ఏమి దొరసాని! కొంపముంచావు. నిన్నని లాభంలేదు. నాపాపం పండింది.

అమ్మ : పాపం పండితే మిగిలేదంతా పుణ్యమే. దీని చరమదశ అది. దాని చరమదశ యిది.

రాజమ్మ : అమ్మా – చిన్నమ్మగారి కోసం పిల్ల ఏడుస్తున్నది ఒక్కసారి బయటకు వచ్చివెళ్లమనమ్మా!

బిచ్చగాని కేక విని అమ్మ బయటకు వచ్చింది. అతని చంకలోనుండి జారి పిల్ల అమ్మ పాదాలమీద పడ్డది. అరగంటసేపు అట్లాగే పడుకున్నది. శరీరం కొయ్యబారింది. ప్రాణం పోతుందేమోనని తండ్రి భయపడ్డాడు. అమ్మ అట్లాగే నిలుచున్నది. రాజమ్మగారు చేసేదేమీ లేక రెండుచేతుల మధ్యనూ తలను పట్టుకుని కూర్చున్నది. వచ్చేపోయే జనం గుమికూడారు. అంతలో రాజమ్మగారి కుమారుడు బాపారావుగారు వచ్చి విసుగుగా అరిచారు:

' ఏమిటి యీ జాతర అంతా? '

రాజమ్మ : ఏమీలేదు నాయనా.

బిచ్చ : నేను దొరా

బాపా : అయితే మనకు సంబంధించినది కాదన్నమాట.

అంటూ యింట్లోకి వెళ్లారు. బిచ్చగానిపిల్ల లేచింది. అమ్మముఖంవైపు అయిదు

నిమిషాలు పరీక్షగా చూచి ' అమ్మా! ' అని పెద్దగా కేకవేసి చక్రంకావాలని అడిగింది.

బిచ్చగాడు అమ్మను అడిగాడు

' ఏమిటి దొరసాని! చక్రం కావాలంటుంది! '

అమ్మ : ఏమోనాయనా నా దగ్గర యేమీ లేదు. వట్టిచేతులేగా.

బిచ్చ : అయితే యిందాకనుండీ అది యేమి చూచి ఉంటుంది? అమ్మా! ఈ పడుకోవడమేటి? ఈ ఏడుపేమిటి? ఎవ్వరిదగ్గరకు వచ్చే బిడ్డకాదే! బిచ్చగానికి పరిస్థితి యేమీ అర్థంకాలేదు. రాజమ్మగారికి కాలం వృధా అవుతున్నదని బాధగా ఉన్నది. ఆ విలంబనాన్ని సహించలేక –

' అమ్మా! సాయంకాలంఅయింది. తెలవారుజామున నాలుగు గంటలకు ప్రారంభించాం. ఇంతవరకు పని పూర్తి కాలేదుగా – '

అమ్మ : మనకున్నపని పూర్తి అవుతున్నదిగా – అమ్మా!

రాజమ్మ : మనకున్నపని భ్రష్టత్వం కావడమేనా?

అమ్మ : అదీ మనకున్న పనేగా.

రాజమ్మ : ఈ సంభాషణ చాలించేసి – ఇకనైనా – ఇదంతా బాగుచేసుకునివచ్చి పనిపూర్తి చేసుకుందాం. రా, అమ్మా –

రాజమ్మగారు అట్లా ప్రాధేయపడుతుంటే అమ్మకు జాలివేసింది. వెంటనే చీపురు, నీళ్లు తీసుకువచ్చి అదంతా కడిగి శుభ్రపరచింది. అదిచూచి రాజమ్మగారు ఉత్సాహంతో అడిగింది.

' ఇక స్నానం చేస్తావా? '

అమ్మ : మీస్థానంలో స్నానం ఎందుకు? మీ స్థానమే నాకు ప్రస్థానం.

రాజమ్మగారికి ఉద్రేకం వచ్చేసి గబగబా అన్నది;

ఆ ప్రస్తావన ఎత్తకు. ఇంతమందికి చెప్పానుకానీ యింత అయోమయంగా ఎవ్వరికీ

జరుగలేదు. - ఇక కాళ్ళుచేతులు అయినా కడుగుకొని ధావళి కట్టుకుని, రా- ఎదురు మాట్లాడక. '

అంటూ అస్తమానమయినందున దీపం వెలిగించుకు వచ్చింది. అమ్మ ధావళికట్టుకువచ్చి రాజమ్మగారికి నమస్కరించింది.

రాజమ్మ : అమ్మా! నీతో మాట్లాడవలసినవి చాలా ఉన్నయ్. కానీ వచ్చినపని ముందు కానివ్వు - ప్రొద్దున నీవు చెప్పిన పంచామృతాలు సిద్ధంచేయి. అమ్మ సిద్ధపరచిన పంచామృతాలు కలిపి అమ్మ నోటిలో పోసి,

రాజమ్మ : ప్రొద్దున ధ్యానశ్లోకం ఒకముక్క చెప్పుకొని ఆపేశావు. కనీసం ఆ శ్లోకమన్నా సాంతం చెప్పించుకో -

అమ్మ : చెప్పుకోటానికేమమ్మా? - చెప్పుకుంటా, చెప్పుకున్న తర్వాత చెప్పవలసిన సమాధానాలు చాలా ఉంటాయి ఈ సమాధానాలు నా కొరకు కాదు.

రాజమ్మ : అసలు నాకు నీవు ఎదురు చెప్పకూడదు.

అమ్మ అయితే మీతో మాట్లాడకూడదనా?

రాజమ్మ : మాట్లాడవద్దని ఎవరన్నారు?

అమ్మ : మాట్లాడటం అన్నప్పుడు-అడగడం, చెప్పడం- రెండూ ఉండాలికదా!

రాజమ్మ : తతిమ్మాచోట్ల ఉండవచ్చు. నా దగ్గర పనికిరాదు. గురుశిష్య న్యాయంలో కూడదు.

అమ్మ : గురుశిష్య న్యాయమంటే అడగటం, చెప్పటమేనేమో. అయినా ఆ సంగతి యిప్పుడన్నారుగానీ నిన్నటినుండి అనలేదేం? - మాట్లాడవద్దని. ఈనియమం యీక్షణం నుండేనా? నిన్నటినుండీ

కాదా? ఈ మాట శాస్త్రసమ్మతమా? మీసమ్మతమా?

రాజమ్మ : శాస్త్రసమ్మతమే.

అమ్మ : ఏశాస్త్రంలో ఎక్కడఉందో చెప్పండి.

రాజమ్మ : నీకేం తెలుస్తుంది, చెప్పినా?

అమ్మ : మరి, ఏంతెలుస్తుందని ఉదయంనుడీ నాకు చెప్పటానికి ప్రయత్నిస్తున్నారు?- ఏది చెప్పినా తెలియనప్పుడు మీకీశ్రమంతా ఎందుకు? అయినా నన్ను వదలివేసి, సామాన్యంగా - గురువంటే యేమిటి? శిష్యుడంటే యేమిటి? మంత్రాలెందుకు? మంత్రమంటే యేమిటి? ఏవి మంత్రాలు?

రాజమ్మ : మంత్రమంటే యేమో తెలియనిదానవు- మంత్రాలంటావు; మంత్రార్థాలంటావు; లక్షా తొంబై ఉన్నాయి మంత్రాలు.

అమ్మ : ఒక్క మంత్రం సంగతేనమ్మా అడిగింది. అసలు మంత్రమంటేనే యేమిటో తెలియనప్పుడు మంత్రాలెన్నయితే నాకెందుకు?

ఆవివరణలో పడితే మళ్లీ వృధాగా కాలహరణం అవుతుందనిభయపడి-

రాజమ్మ : సరే! అనుకున్నపని పూర్తి అయినాక అన్నీ వివరించి చెపుతాను లేచి, రా

అమ్మ : దగ్గరనే ఉన్నానుగా అమ్మా! రావడమంటే ఎంతవరకు రావాలో తెలియలేదేమో- ఎక్కడకు వస్తే వచ్చినట్లు?

రాజమ్మ : ఏమి ప్రశ్నలివి?

అమ్మ : అమ్మా! రోజు గడిచిపోతున్నది.

రాజమ్మ : అదే నాయేడుపూ.

అమ్మ : ఇదే నాసంతోషం.

రాజమ్మ : అనుకున్నది కాకపోవడమేనా?

అమ్మ : తనకున్నది తప్పించుకోలేరని ఋజువవుతున్నందున.

రాజమ్మ : ఈ సంభాషణ అపరిమితంగా పెరిగిపోతున్నది. ఒడ్డులేదు; దారిలేదు.

అమ్మ : ఆదిలేదు: అంతంలేదు కనుక- అదీ, అంతం అదేగనుక.

రాజమ్మ : ఏది ఆది? ఏది అంతం?

అమ్మ : నేనే ఆది; నేనే అంతం.

రాజమ్మ : రెండూ నీవెట్లా అవుతావు?

అమ్మ : పుట్టినప్పుడు ఆది; పోయినప్పుడు అంతం.

అంతలో బాపారావుగారు వచ్చి వారికి అశూచి వచ్చిందని చెప్పి వెళ్లిపోయినాడు. రాజమ్మగారికి విసుగేసి పోయింది.

రాజమ్మ : ఛా! తానొకటి తలిస్తే-దైవమొకటి తలచింది.

అమ్మ ఆ సామెతను అంగీకరించదు. మనిషియొక్క యావజ్జీవితానికీ దైవమే కారణమనీ, మనసులోకలిగే ప్రతిచిన్న ఆలోచనకుకూడా దైవసంకల్పమే మూలమనిన్నీ, అమ్మ దృఢమయిన అభిప్రాయం. దానినే రాజమ్మగారితో అన్నది.

' దైవంతలిస్తేనే తాను తలుస్తాడు. తాను తలిచేది వేరేలేదు.

ఈ అపూర్వ సిద్ధాంతానికి మరీ ఆశ్చర్యపోయి-

రాజమ్మ : నీవంతా వికటకవిగా ఉన్నావు దారీ డొంకా లేదు, ధర్మంలేదు. మడి లేదు, ఆచారంలేదు.

అమ్మ : అయితే మీరన్నవి మినహా మిగతావి నాకున్నవిగా-

ఆ వింత ప్రశ్నలకూ, సమాధానాలకు అయోమయమ్మైపోయి -

రాజమ్మ : ఇదంతా కటిక చీకటిగా కనబడుతున్నది. ఏమీ కనుపించడంలా.

అమ్మ : ఔను; దీపంఉన్నా కనబడదమ్మా.

రాజమ్మగారు వింతగా అమ్మ ముఖంలోకి చూచింది.

అమ్మ : కన్నులున్నా చూడలేవమ్మా.

రాజమ్మ : ఎందువల్ల?

అమ్మ : గుర్తించే గుర్తులేక.

రాజమ్మ : కనపడేది కంటికా? గుర్తుకా? రామ రామ!! ఏం మాట్లాడాలో, ఏం చెప్పాలో తెలియకుండా పోతున్నది. ఈ అవస్థలో పైగా అశుచి.

అమ్మ : ఎవరికి?

రాజమ్మ : నాకే.

అమ్మ : అయితే, నాకు చెప్పటానికేం?

రాజమ్మ : మైలలో పనికిరాదమ్మా.

అమ్మ : మైలరానప్పుడూ, వచ్చినప్పుడూకూడా మీరు ఒకలాగానే కనబడుతున్నారే.

రాజమ్మ : అది కనబడేది కాదు; అనుకునేది.

అమ్మ : లేదనేదికూడా అనుకునేదేగా?

రాజమ్మ : ఇంతకూ నీకు పురుళ్లూ, సూతకాలు పట్టడం అలవాటు లేదాయేమిటి?

అమ్మ : లేకేం?– ప్రత్యేకంగా పట్టేదేముంది? పుట్టారనే సంతోషమున్ననాడు పురుడున్నది. చచ్చారనే దుఃఖమున్ననాడు మైలఉన్నది. అది నే పట్టేదేమున్నది?

బాపారావుగారు మళ్లీ వచ్చారు;

' చెప్పటం మరిచిపోయాను. మైల స్నానంతోసరి అమ్మా'

రాజమ్మ : బ్రతికించావు నాయనా.....

నిరాశోపహతురాలయిన రాజమ్మగారిలో మళ్లీ ఆశాభావం పొడసూపి అమ్మను నీళ్లుతోడి యివ్వమనికోరింది. అమ్మ రాజమ్మగారిని స్నానం చేయిస్తూ అడిగింది.

' అమ్మా! ఇందాక బ్రతికించావు అన్నారే! చంపేదికూడా వారేనా?'

రాజమ్మ : ప్రతి అక్షరానికి యిట్లా అడిగితే ఎట్లాగమ్మా? విపరీతార్థాలు అడుగుతూ ఉంటావు-

అమ్మ : తోస్తుంటే ఏంచేసేదమ్మా? మీరుకూడ చెప్పకపోతే ఎవరు చెపుతారు! ఇదివరకు ఏమయినా సందేహాలు కలిగినా, సమాధానాలు చెప్పేవారులేక అడిగే అవకాశమే లేకపోయింది. అయినా నిన్ననే చెప్పానుగా- మామూలుగా నేర్పే అమ్మకూడా లేదని.

రాజమ్మ : పదేపదే ఆ మాట అనకమ్మా.

రాజమ్మగారి స్నానం పూర్తి అయింది. అమ్మ రాజమ్మగారి ఒళ్లు తుడిచి బట్టకట్టింది. అప్పటికి రాత్రి ఎనిమిదింబావు అయింది.

రాజమ్మ : అమ్మా- ఆవు నేతితో దీపారాధన చెయ్యి.

అమ్మ : వత్తిలేదు; పత్తిలేదు; నూనెలేదు.

రాజమ్మ : అన్నీ నేను యిస్తానమ్మా.

అమ్మ : చేసి నిల్వఉన్నవి యివ్వడంకాదు. అవెందుకో అవియేమిటో, వివరంగా చెప్పి- చేయించుకో అమ్మా.

రాజమ్మ : దీపారాధనకు కూడా వివరణకావాలీ?

- రోజూ దీపం పెట్టుకోవడంలా?

అమ్మ : దీపానికి కారణం తెలుస్తున్నది. కాని దీపంఉండగా దీపారాధన అవసరమయింది. అందువల్ల దీపారాధనకు వివరణ కావాలి అంటున్నాను. అయినా అమ్మా - మామూలు దీపంవల్ల మనచీకటి పోతుంది. దీపారాధన వల్ల దేవుడికిచీకటి పోతుందా?

రాజమ్మ : భగవంతుడికి చీకటి యేమిటి? అప్రశస్తపు మాటలు మాట్లాడుతుంటావు.

అమ్మ : అసలు భగవంతుడంటే యేమిటమ్మా?

రాజమ్మ : అరి భగవంతుడా! భగవంతుడంటే ఏమిటని అడుగుతున్నావా?

అమ్మ : ఆс-భగవంతుని నే నేమీ చూపించమని అడగడంలేదు, భగవంతుడనే పదానికి అర్ధంచెప్పమంటున్నాను. అది చెప్పి నమ్మించినప్పుడు- మీరే భగవంతుడు.

రాజమ్మ : అన్నీ గుడ్డి ప్రశ్నలు వేస్తావు. అసలు నీవెందుకు వచ్చావు? చెప్పు-

అమ్మ : యథార్థం తెలుసుకోగల అమ్మవనీ, యథార్థం చెప్పగల అమ్మవనీ అడుగుతున్నాను.

రాజమ్మ : యథార్థమంటే ఉన్నది ఉన్నట్లనేగా నీఉద్దేశం?

అమ్మ : అంతే అమ్మా! చూచేది, చెప్పేది, చేసేది- ఇన్నింటిలోనూ యథార్థమే కావాలంటున్నాను.

రాజమ్మ : మూడూ ఒకటయినప్పుడు మాట ఎక్కడున్నదమ్మా?

అమ్మ : రెండయితే చాలు. చేసేది చెప్పినా చాలు. చూసేది చెప్పినా చాలు.

రాజమ్మ : అయితే నేను చూడనిది, నేను చెయ్యనిది చెప్తున్నానా?

అమ్మ : అని నేనన్నానా?

రాజమ్మ : అన్నావని కాదు. ఆమాటకు అర్థం అట్లా ఉన్నది.

అమ్మ : ఆ అభిప్రాయం నాకు లేనప్పుడు నేనినట్లు కాదుగా. ఇంతకూ భగవంతుడంటే చెప్పలేదుగా? నేను వచ్చింది అందుకు. మీరు చెప్పబోయే సర్వ మంత్రాలసారమూ ఇదే?

రాజమ్మ : ఇక మంత్రమక్కరలేదా ఏమిటి?

అమ్మ : మంత్రమెందుకు అసలు?

రాజమ్మ : తనను తాను తెలుసుకోవటానికి

అమ్మ : తన్ను తాను తెలుసుకోవటమంటే భగవంతుని తెలుసుకోవటమేగా!

భగవంతుని తెలుసుకునేదీ తానే. తన్ను తెలుసుకునేదీ తానే. సర్వాన్ని తెలుసుకునేదితానే. సర్వాన్ని తెలుసుకున్న తెలివే భగవంతుడా?

రాజమ్మ : అన్నీ తెలుసుకున్నప్పుడు భగవంతుడే-

అమ్మ : అదేగా అమ్మా, అడుగుతున్నది ఎవరు భగవంతుడవుతారు? ఎట్లా అవుతారు? ఎప్పుడవుతారు?

రాత్రి తొమ్మిదిన్నర అయింది. పూర్ణచంద్రుడు షోడశకళలతో ప్రకాశిస్తున్నా- మేఘమాలికలు లోకానికీ చంద్రుడికీ మధ్యలో తారాడుతూ లోకంపై చీకటి తెరలను కప్పుతున్నాయి. ఆ మేఘాలను దూసుకువచ్చే కిరణాలు ప్రసరించే వెన్నెల వెలుగు వెల్లువలో లోకం పులకించి పోతున్నది. ఉండి ఉండీ అక్కడక్కడా వానజల్లు పడుతున్నది. సరిగ్గా ప్రకృతికి ప్రతిబింబంగా ఉన్నది. రాజమ్మగారింటిలో వాతావరణం. సాక్షాత్ భగవంతుడు ఎదురుగా కూర్చుని ఉన్నా మధ్యలో మాయతెర అడ్డుగోడలా ఉన్నది. అప్పుడప్పుడు అమ్మపలికిన సత్యవాక్కుగానీ, ప్రసాదించిన దివ్యదర్శనంగానీ, కన్నులు విరిమిట్లు గొలిపేలా కాంతిని ప్రసరించినప్పుడు మాత్రం రాజమ్మగారి సుప్తమానసం జాగృతమౌతూనే ఉన్నది; ఆనందంలో పరవశించి పోతూనే ఉన్నది. సంతోష బాష్పాలు జాలువారుతూనే ఉన్నాయి. కాని ఏమి ప్రయోజనం? అంతలోనే మాయమబ్బులు కమ్ముతాయి రాజమ్మగారికి తన గురుత్వమే స్ఫురణకు వస్తుంది. తాను ఆచార్య పీఠమధిరోహించి పద్మాసనం వేసుక్కూర్చుంటుంది.

రాజమ్మ : చిన్నప్పటినుండీ నీ యథార్థస్థితి యేమిటో చెప్పమ్మా.

అమ్మ : నా యథార్థస్థితి నేనే చెప్పాలంటే నేను యింతసేపు యిక్కడ ఉండను.

ఔను; అన్ని దృశ్యాలు చూచీ, అంత అనుభవంపొందీ మళ్లీ రాజమ్మ గారు ఆ

ప్రశ్నవేసిందంటే- అన్నీ అద్దంమీది ఆవగింజవలె అంతలోనే తెర వెనక్కు జారిపోయినవన్నమాట. అమ్మకేమో ఏమీ వాగ్రూపంగా అందించటం అలవాటులేదు. చర్యలద్వారా- అదీ పరోక్షంగా- ప్రబోధించటమే అమ్మ అభిమతం. ఏమయినా తెలియజేయటమేకానీ, తెలియజెప్పే విధానంలేదు. చెప్పితే ఒక్కమాటచాలు. అందుకు యింత సంభాషణా, యింత సమయమూ అవసరం లేదు. ఏ అద్భుతంవల్లనో, ఏ లీలవల్లనో తెలియజేసినా- అది స్థిరంగా ఉండకపోవచ్చు; అది విశ్వాసంగా పరిణమించక పోవచ్చు. క్రమపద్ధతిలో వచ్చిన పరిణామంవలన కలిగినగుర్తు అయితే దృఢమై విశ్వాసమవుతుంది. ఆ విశ్వాసమిక చెదరదు. అందుకే ఒక రాజమ్మగారి హృదయంలో సత్యాన్ని ఆవిష్కరించేందుకు యింత కాలమూ, సుదీర్ఘ కార్యక్రమమూ అమ్మ చేబట్టవలసివచ్చింది.

రాజమ్మ : నీవు ఎందుకో వచ్చావనిపిస్తున్నదమ్మా!

అమ్మ : అసలు అంతేగా.

రాజమ్మ : వచ్చింది అందుకే నంటావా?

అమ్మ : అందుకే అంటే – ఫలానందుకని మీకు తెలిసినట్లేగా?

రాజమ్మ : ఎందుకూ అందనమ్మవమ్మా.

అమ్మ : ఎందుకూ కందనమ్మనే.

రాజమ్మ : అందుకే కమ్మనమ్మవు.

అమ్మ : అదే- నమ్మనమ్మను.

రాజమ్మ : ఏమి నమ్మవు?

అమ్మ : చెప్పేది నమ్మను. చేసేది నమ్ముతాను.

రాజమ్మ : అమ్మా- నేనన్నమాట విన్నావా?

అమ్మ : అన్నావా ఏమన్నా?

రాజమ్మ : అన్నానమ్మా.

అమ్మ : అంటే విని ఉంటాగా.

రాజమ్మ : కోపం వచ్చిందా, అమ్మా?

అమ్మ : గుర్తు ఉన్నది. కోపంలేదు, కోపమంటే ప్రకోపమేగా. గుర్తు ఉండటం కూడా ప్రకోపమే.

రాజమ్మ : అమ్మా! ఘడియలు గడిచిపోతున్నాయి. పని నిలిచిపోయింది. మనసు పరిపరివిధాల పోతున్నది. ఉన్నది గుర్తించలేక పోతున్నాను. జరుగబోయేది ఊహించలేక పోతున్నాను. నీముఖ వర్చస్సు మారిపోతున్నది ఆ వర్చస్సును యిదమిత్థమని చెప్పలేను. ఆనందమో– లేక ఆనందమనేది నా అనుమానమో చెప్పలేను.

అమ్మ మౌనంగానూ, నిశితంగానూ రాజమ్మగారి ముఖంలోకి చూస్తూ ఉంటే– రాజమ్మగారు ప్రాధేయపడింది;

' చెప్పుకో అమ్మా...... '

అమ్మ : ఏది ఎట్లాజరిగినా నాకు చెప్పటమే మీకు ముఖ్యంగా తోస్తున్నటున్నది. కాని నాకు చెప్పటం యింత ముఖ్యంగా ఎందుకు తోస్తున్నదో, మన యిద్దరి యీ సంభాషణా, యీ చెప్పటం, వినటం, చెప్పిచేయించటం, నడిచి నడిపించటం, నమ్మి నమ్మించటం, నొప్పించకుండా మెప్పించటం యీ ద్వంద్వాలూ, యీ కార్యక్రమం అచ్చగా నాకొరకుకాదు. మీకూ, నాకూ, ప్రపంచానికీ–

రాజమ్మగారు యీ కార్యక్రమం కేవలం అమ్మకు ఉపదేశంచేసే నిమిత్తమే ఏర్పాటు అయిందనే భ్రమలో ఉన్నదనీ, ఆ భ్రాంతిని వదిలించేదుకు సంకల్పించి ' మీకోసం కూడానని చెప్పింది. మరి, రాజమ్మగారిని సంస్కరించటమే ప్రధాన ఉద్దేశంకదా. ఇక, ఎక్కడో రాజమ్మగారి యింటిలో ఒక మూల జరిగిన యీ సంఘటన వలన

ప్రపంచానికి ఏమి ఉపయోగం?- ఎప్పుడోఎక్కడో కురుక్షేత్రంలో కృష్ణార్జునులకు జరిగిన సంభాషణ భగవద్గీతయ్యై నేటికీ ప్రపంచానికి మార్గదర్శకం కాలేదా? అట్లాగే యీ సంభాషణ జగద్విఖ్యాతమ్మై అనేక హృదయాలకు ప్రబోధం కలిగించాలని అమ్మ ఉద్దేశమ్మై ఉంటుంది.

రాజమ్మ : మనది మనకే తెలియనప్పుడు, ప్రపంచాన్ని ఉద్ధరిస్తామా అమ్మా?

అమ్మ : నన్ను ఒక్కదాన్నే ఉద్ధరిద్దామనుకున్నారా- అమ్మా!

రాజమ్మ : నేను ఉద్ధరించను. నీ సంస్కారమే నిన్ను ఉద్ధరిస్తుంది.

అమ్మ : అప్పుడు మీరక్కరలేదుగా, లేక నా సంస్కార రూపమే మీరా?

రాజమ్మ : అమ్మా! ఏమయినాసరే. త్వరగా చెప్పుకో. తర్వాత విశ్రాంతిగా మాట్లాడుకోవచ్చు.

రాత్రి పదకొండున్నర అయింది. లోకం నిద్రలో జోగుతున్నది. కాని ఒకవ్యక్తి హృదయంలో మాత్రం మేలుకొలుపులు వినిపిస్తున్నాయి. లోకమతిప్రశాంత వాతావరణంలో పవళించిందికాని ఒక హృదయం మాత్రం కల్లోలితమౌతూ ఉన్నది. అమ్మ స్ఫటికాలదండ చేతపట్టుకుని రాజమ్మగారికి నమస్కరించి దగ్గర కూర్చున్నది.

రాజమ్మ : అడ్డు చెప్పకుండా సాంతము చెప్పుకో అమ్మా.

అమ్మ : ముందు చెప్పినా సవరించవలసినది చాలా ఉంటుంది. సవరణపూర్తి అయినప్పుడే చెప్పుకున్నట్లు. తృప్తినీ, శాంతినీ, హాయినీ యిచ్చి సందేహ నివృత్తిని చేయగలిగిందే మంత్రము.

రాజమ్మ : సరేనమ్మా! చెప్పుకో- బలవంతపు మాఘస్నానంగా ఉన్నది.

అమ్మ అమ్మా! బలవంతపు మాఘస్నానం కాదు; మహా ప్రబలమ్మైన ఘట్టం.

రాజమ్మ : అయితే కావచ్చు- చెప్పుకో.

అమ్మ : ఈ చెప్పుకో చెప్పుకో అనటమంతా చెప్పుకోవటమేగా.

రాజమ్మ : ఇదే చెప్పుకోవడమయితే- చెప్పుకునే పనిలేదనా?

అమ్మ : పనిలేదని కాదు. చెప్పుకొనడం జరుగుతూనే ఉన్నదనుకుంటున్నాను.

రాజమ్మ : అమ్మా! ఇది ఎందుకు వచ్చిందో తెలియదు. కొన్నివందల మందికి చెప్పివుంటాను; ఎవ్వరూ యిటువంటి అడ్డు ప్రశ్నలు వేయలేదు.

అమ్మ : అడ్డు ప్రశ్న కాదమ్మా. వాళ్లకు అడగటానికి తావులేదు. అడగటానికి యీ తావు నాకు మీరిచ్చినదేగా.

రాజమ్మ : ఊఁ... చెవి ముందుకు పెట్టమ్మా-

ఇక ఏమాత్రం కాలవిలంబనాన్ని సహించలేక రాజమ్మగారే అమ్మ వద్దకు జరిగి, చెవిలో నోరుపెట్టి-

' గురుర్బ్రహ్మా గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః '

అని గబగబా శ్లోకం పూర్తిగా చెప్పి-

' నీకేం మంత్రం కావాలమ్మా? ' అని అడిగింది.

అమ్మ : చెప్పారుగా అమ్మా

రాజమ్మ : అది మంత్రం కాదు. ధ్యాన శ్లోకం.

అమ్మ : ధ్యానమంటే ఒక ధ్యేయాన్ని స్మరించడమేగా.

రాజమ్మ : అవును. మొదలు అదే. తరువాత మంత్రాన్ని పఠించాలిగా.

అమ్మ : ఇదే పఠిస్తానమ్మా. ఇదే మంత్రం ఎందుకుకాదు? మాటలన్నీ మంత్రాలే అనిపిస్తున్నయ్యమ్మా! పైగా, యికవేరే యింకొక మంత్రంమీద ఆసక్తి కలగటంలేదు. కనుక యిది చాలమ్మా.

రాజమ్మ : ఇదే చాలుననడంలో నీ ఉద్దేశ్యమేమిటి? ఈ శ్లోకంలో నీకేమి అర్థమయింది?

అమ్మ : అర్థం పొందినప్పుడుగాని కాదు. పొందింపజేసే బాధ్యత మీది.

రాజమ్మ : పేచీ లేకుండా మూలమంత్రాన్నిస్తాను, చెప్పుకో. అంటే-అదేశక్తి

మంత్రం.

అమ్మ : మూల మంత్రమంటే- మొదట్లోదా? ఎక్కడో మూల ఉంటుందా? ఒకటి శక్తి మంత్రమంటే తక్కినవాటికి శక్తిలేదా? అశక్తతగల మంత్రం, శక్తిగల మంత్రం- రెండూ యివ్వండి. ముందు చేయవలసినది గురు ధ్యానం కనుక దానికి అర్థంచెప్పి తరువాత మంత్రమూ, మంత్రార్థమూ చెప్పండి.

రాజమ్మ : రెండూ కలిపి ఒకేసారి చెపుతాను.

అమ్మ : రెండు అన్నతర్వాత రెండూ ఒకసారి కలవవుగా, కలిసిఉంటే- ఒకటి చెప్పినప్పుడు రెండోది అర్థం అయ్యేదే.

రాజమ్మ : అసలు శ్లోకం నోట పట్టిందా?

అమ్మ : మనస్సుకు పట్టింది.

రాజమ్మ : ఏమని?

అమ్మ : గురువు బ్రహ్మయేనని.

రాజమ్మ : తతిమ్మా శ్లోకమంతా......

అమ్మ : గురువు బ్రహ్మ అయినప్పుడు- అని తెలుసుకున్నప్పుడు- ఆ గురువుకు ఆత్మార్పణ చేసుకొనడమే-మరి, నమస్కారం అంటే చేతులు కలయికే కాదుగా.

' ఓం, ఐం, క్లీం, హ్రీం, శ్రీం. ఓం, ' అని రాజమ్మగారు అమ్మ చెవిలో బీజాక్షరాలు చెప్పి దండ చేతికి అందించారు. అమ్మ ఆ దండలో కొలికిపూసపట్టుకని ఓంకారం ప్రారంభించింది. సుదీర్ఘమయిన ఆ ఓంకారం పూర్తికాకముందే అమ్మ చేతిలోని దండతోపాటు, సర్వేంద్రియాలూ నిశ్చలత పొందినయ్- అంతే. అమ్మ సమాధిగత అయింది. తిరిగి జాగ్రత లోనికి వచ్చేటప్పటి తెల్లవారు జామున నాలుగున్నర అయింది. అమ్మ కళ్లు తెరిచిచూస్తే- రాజమ్మగారు అమ్మ ఒడిలో పడుకుని ఉన్నది.

అమ్మ లేచి రాజమ్మగారి పాదాలు పట్టుకొన చేతులు చాపింది.

' అమ్మా! తల్లీ! జగజ్జననీ! నా కాళ్లు పట్టుకుంటున్నావా? వద్దు. వద్దు..... ' అంటూ రాజమ్మగారు అమ్మ పాదాలను పట్టుకున్నది.

అమ్మ : అమ్మా! నా పాదాలమీదకు మీ చేతులూ, మీ పాదాలపైకి నా చేతులూ ఒకేసారి వాటంతట అవే వస్తున్నాయికదా! అంటే చేయించుకున్నవారు, చేసేవారు ఒకటేననా?

రాజమ్మగారి ముఖమూ, కన్నులూ కూడా తేజోవంతంగా ఉన్నయ్. కన్నీరు ధారలుగా కారుతున్నది.

రాజమ్మ : అమ్మా! నీ మాటలు వినబడడం లేదు. నీ రూపం నా హృదయంలో నిలిచిపోయింది.

అమ్మ : అమ్మా! నేను వినేదంతా మీ మాటే. కనేదంతా మీరూపే. చేసేదంతా మీసేవే. మీ పాదాల్లో నాభర్త పాదాల స్పర్శ, తగిలింది. ఆకర్తే యీకర్త. ఆ భక్తియే యీ నా భక్తి.

రాజమ్మగారు ఆ మాటలను మరొకసారి అనమని వేడుకున్నది. అమ్మ మళ్లీ అవే పదాలను అన్నది.

రాజమ్మ : ఈ నా పాదాలలో ఆ పాదాలు ఎట్లా చూశావమ్మా.

అమ్మ : ఈ పదాలన్నిటికీ ఆ పాదాలే సాక్షి ఆ పథాలలోవే యీపాదాలు గనుక- అందులో విశేషమేమున్నది? అదీగాక మీకు నమస్కారం చేసేటప్పుడు నా సూత్రాలు రెండూ మీ పాదాలమీద పడ్డయ్. ఒకాసారికాదు; నమస్కారం చేస్తున్నప్పుడల్లా. సూత్రాలేకాదు మనస్సూ, అవయవాలూ- అన్నీ మీపాదాలపై వాలిపోతున్నయ్.

రాజమ్మ : అమ్మా! యీ సద్భావాలూ, ఉన్నతమయిన అభిప్రాయాలూ చిన్నప్పటి నుంచీ ఉన్నాయా?

అమ్మ : ఈ భావాలన్నీ ఉన్నాయని ఎవరు చెప్పారో, ఎప్పటినుండి అనేది వారే చెపుతారు. నేను రాగానే మీకే అభిప్రాయమున్నదో, ఇప్పటికీ ఏ అభిప్రాయాలు ఉన్నాయో- వీటన్నిటికీ ఎవరు కారణమంటారు? మీలో కలిగే పరిణామాలు మీకే తెలియాలి అవి నాకు కూడా తెలిపితే ఆనందిస్తాను.

రాజమ్మ : నాసంగతి సరేనమ్మా! మంత్రం చెప్పుకోగానీ నీలో కలిగిన మార్పులు నీకు గుర్తున్నాయా?

అమ్మ : గుర్తుంచుకోవలసిన పనిలేదు. మార్పులతో పనిలేదు. ఏమి కలిగినా కాదనేదిలేదు. విధే విధానం కనుక. విధి మీరు; విధానం నేను.

రాజమ్మ : అమ్మా! ఒకసారి నా తల నీ హృదయానికి హత్తుకో అమ్మా! నేను చేసిన పూజ, నేను చేసిన జపం- కొన్ని కోట్లుచేసి ఉంటాను- దానికి ప్రతిఫలంగా దైవమే యిట్లా బోధ చేయించుకోవటానికి, బోధచేయటానికీ రూపంచూపించటానికి వచ్చింది. అందులో ఆ రూపంలో కూడా బిడ్డగా- అదీ ఒకక్షణంలో ఉన్న రూపం మరోక్షణంలోలేదు. నా తల్లివో, బిడ్డవో, దైవానివో, మోసానివో, సత్యానివో, అంతా అబద్ధమో- ఏదో అర్థం కాని ఆనందం...... కాలు నిలవడం లేదు; శరీరం వణుకుతున్నది.

అమ్మ : అంతే! అంతే- అంతా అబద్ధమే. అందుకే అర్థంకాని ఆనందం. అంతలో రాజమ్మగారు కర్పూరం తెచ్చింది. కొబ్బరికాయ దొరకలేదు;

బాధపడ్డది తెల్లవారకముందు కొబ్బరికాయ ఎట్లా దొరకుతుంది!

రాజమ్మ : కొబ్బరికాయ లేదమ్మా.

అమ్మ : కర్పూరం ఎందుకున్నదో, టెంకాయ అందుకే లేదు. పోనీ, నా టెంకాయ కొట్టుకో-

అంటూ అమ్మ తనతల చేతితో కొట్టుకుని చూపించింది.

రాజమ్మ : అయ్యో! నొప్పి అమ్మా.

అమ్మ : నెప్పి ఉన్నా నొప్పిలేదు.

రాజమ్మ : నేను నొప్పించ లేనమ్మా.

అమ్మ : పోనీ– మెప్పిస్తారుగా.

రాజమ్మ : ఎవరిని?

అమ్మ : ఫలానావారి నని కాదు. ఎవరి నయినాసరే......

రాజమ్మ : అమ్మా! తెల్లవారుజామున రెండున్నరకు చూపిన దృశ్యం ప్రపంచంలో ఎప్పటికయినా, ఎవరయినా, ఏఒక్కరయినా దర్శించకపోయినా కనీసం ఊహిస్తారా?

అమ్మ : మీరుచూస్తారని నేను అనుకున్నానా? మీరు చూచిందేమిటో నాకు తెలియదు. చూపించటానికి రాలేదు. చూచేటందుకు వచ్చాను.

రాజమ్మ : రాత్రి జరిగింది నిజమా? భ్రమా? కలగన్నానా?

అమ్మ : మీరు కలగన్నారో, కథ విన్నారో నాకేం తెలుసు? నేను మిమ్మల్ని కనేందుకు వచ్చాను.

అంటే ప్రసవించేందుకు అని అమ్మ భావన అయిఉంటుంది. ప్రసవించటమంటే జన్మ నివ్వటమేగా! ఔను. రాజమ్మగారికది పునర్జన్మ అన్నమాట. జ్ఞానో దయమే పునర్జన్మ.

రాజమ్మ : కనేందుకుగాదమ్మా. కనుపించేందుకే- వచ్చావు.

అమ్మ : ఏమిటీ? – కనిపెంచేందుకా?

ఆ మాట వినేటప్పటికి రాజమ్మగారు విభ్రాంతురాలయింది. రాత్రికలిగిన 'దర్శనం' మరొక్కమారు కనులముందు నిలిచింది. తనువు నిశ్చేతనమయింది. కనులు

అశ్రుపూర్ణమయినాయి కొద్దిక్షణాలు జరిగాయి.

రాజమ్మ : ఔను. ఎంత బాగా చెప్పావమ్మా? ఎంత సరిగా అన్నావమ్మా? ఈ జగత్తునంతనూ, నీవే కని, పెంచుతున్నావు. రాత్రి అదే చూశాను. ఇప్పుడు నీ నోట అదే విన్నాను. ఎంత అదృష్టం?

అమ్మ : ఎవరిది?

రాజమ్మ : ఎవరిదైతేనేం కానీ– నాకో చిన్న ఉద్దేశముందమ్మా.

అమ్మ : ఉద్దేశానికి చిన్నదీలేదు. పెద్దదీలేదు. ఒకే విషయం ఒకరికి చిన్నదిగానూ, మరొకరికి పెద్దదిగానూ తోచవచ్చు.

రాజమ్మ : పోనీలే–అమ్మా. లేకపోతేమానెలే. నేను చెప్పేది విను.

అమ్మ : వినకేమమ్మా? వినేదంతా నీ మాటే. నాలో కలిగే కదలికంతా నీ చైతన్యమే. జగత్ చైతన్యంకూడా నీ కదలికే.

మరి రాజమ్మగారు అమ్మకు గురుత్వం వహించారు కదా. గురువు బ్రహ్మ స్వరూపం. ఆ వాక్యం అంతకుముందే ఉపదిష్టమయింది. బ్రహ్మమే యీ సర్వ జగత్తుకూ ఆధారభూతం. కనుక శిష్యుని దృష్టిలో గురువే జగత్తుకు చైతన్య ప్రదాత. రాజమ్మగారు మాత్రం యీ మాటలు వినేస్థితిలో లేదు.

రాజమ్మ : అమ్మా! నీకింత ' స్థితి ' కలిగి, యిటువంటి అవతారమ్మై, సామాన్యుల దృష్టిలో మహాసాధ్వియై మెలిగే నీకు అందరిలో గొప్పదనమే కనపడుతుందమ్మా.

అమ్మ : ఇన్ని లక్షణాలను నాలో గుర్తించిన మీ గొప్పతనాన్ని ఏమంటారో?

రాజమ్మ : నీలో ఉండే ఆ నిశ్చలత్వమే నిన్ను గుర్తింపచేసినదమ్మా- అది సరేగానీ, యీ పూటైనా నా చేతిమీదుగా ఒక ముద్ద అన్నంతిని - కాదు, కాదు - పట్టెడన్నం తిను. నాకున్న అభిప్రాయాలు కొన్ని చెపుతాను. అభిప్రాయాలనటం కంటే వాటిని కోర్కెలంటే

బాగుంటుందేమో.... అడిగేదా?

అమ్మ : అడుగమ్మా - మీరు చేయిస్తే చేసేదానికి నాకేమి బాధ?

రాజమ్మ : బాధ కాదమ్మా బాధ్యత నీకు.

అమ్మ : బాధలేని బాధ్యత నివ్వుతల్లీ! సాధ్యమైతే బాధేలేదు. అసాధ్యమయితే....?

రాజమ్మ : నీకసాధ్యమేమిటమ్మా?

అమ్మ : జరిగేది సాధ్యం. చెప్పుకుండేది అసాధ్యం. ఇది చెప్పుకోటంగానే ఉన్నది కనుక.

రాజమ్మ : అబ్బా! స్థితి ఎట్లాఉన్నా- ఎప్పుడూ యిట్లా మాట్లాడుతూ ఉండమ్మా. నీవు మాట్లాడుతుంటే - ఒక్కొక్కసారి అన్ని వాద్యాలు వినిపిస్తున్నాయమ్మా.

అమ్మ : వినిపిస్తున్నాయా? అనిపిస్తున్నాయా? వినిపిస్తుంటే వినటమేపని. అనిపించేది విన్నట్లు కాదుగా.

రాజమ్మ : అమ్మా! పెద్దలూ, శాస్త్రమూ దశవిధానాదాలు వినిపిస్తాయంటారే. అది ఎప్పుడో, ఎక్కడో, ఏస్థాయికి వెళ్లిన తరువాతనో, నిజమో, అబద్ధమో తెలియదు. ప్రత్యక్ష ప్రమాణంగా రాత్రి విన్నాను.

అమ్మ : ప్రతి మాటలో వినపడుతూనే ఉన్నాయిగా.

రాజమ్మ : మీకు ప్రతి మాటలోనూ వినపడవచ్చు; నాకుమాత్రం మీ ప్రతిమాటలోనూ వినపడుతున్నది అదీ, యిప్పుడే; రాత్రి నుండే.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఏదో ఊహాసముద్రంలో మునిగిపోయిన రాజమ్మగారు తెప్పరిల్లి అడిగింది.

' నీ జీవిత చరిత్ర కావాలమ్మా '

అమ్మ : నా జీవితమే అబద్ధం. చరిత్ర బద్ధం-చెప్పానుగా.

జీవితాలన్నీ బద్ధములే, దైవశాసనానికీ, విధి నిర్ణయానికీ, ప్రతిజీవితమూ ఆ శాసనానికీ నిర్ణయానికీ లోబడి నడవవలసినదే. అక్షరం మార్పు జరగటానికీ అంగుళం గీత దాటటానికీ ఎవరికీ శక్యముగాదు. మరి, తానే దైవమయిన అమ్మ జీవితం ఏ శాసనానికి బద్ధమవుతుంది? తన యిచ్ఛానుసారం అంటే తనకు ఎప్పుడు ఎట్లా అవసరమనిపిస్తే-అట్లా నడుపుకుంటుంది. ఎట్లా నడిచినా, గడిచినా గతం మాత్రం చరిత్రబద్ధమవుతుంది. ఆ చరిత్ర కవుల కావ్యాల కాధారమ్మై, గాయకుల గానానికి జీవమ్మై, భక్తుల భావనల కాలంబమ్మై, సర్వులకూ ఆదర్శమౌతుంది. ఇదంతా అర్థంకాని రాజమ్మగారు అడిగింది.

' అర్థం కావద్దమ్మా? – అర్థం కావద్దూ? '

అమ్మ : కాకేమి? అయిందిగా.

రాజమ్మ : ఏమయింది? ఏమి కాలేదు?

అమ్మ : ఏమి అర్థం కాలేదని అర్థమయింది. మోసమూ, సత్యమూ, బిడ్డా, దైవమూ యిన్ని రూపాలు అర్థమయినవి. అన్నీ యిప్పుడు చెప్పలేక పోయినా యింతవరకు జరిగిన విషయమంతా గుర్తుపెట్టుకుంటే – ఒకరకంగా గాదు. నానారకాలుగా అర్థమ్మైనాను; అంటే ఒకటే అనేకం గనుక. అందుకే అనేక రకాలుగా అర్థమయినాను. ఆ అనేకం మీరే.

రాజమ్మ : అబ్బా! నీ వెనుకనుండి, ఎవరో చెపుతున్నట్టుందమ్మా. అయినా నీకు వెనకేమిటి? ముందేమిటి? నాకు మధ్య మధ్యలో పొరపాటు వస్తుందమ్మా. కాని ఎవరికి ఎవరో చెప్పినట్లుగా, నేను నీకు యిట్లా కావడమంటే..... ఉన్నదిలే ఒక కథ నేను చెప్పడంకంటే నీవే అన్ని మంత్రాలకు అర్థం చెబుతావు.

అమ్మ : ఆఁ చెప్పిస్తే.

రాజమ్మ : ఏం తల్లివమ్మా!

అమ్మ : కన్నతల్లిని.

రాజమ్మ : ఏం కన్నావు?

అమ్మ : నిన్ను కన్న తల్లిని నేను, నన్ను కన్న తల్లివి నీవు: తల్లి ఎవరౌను? ఎవరు కాదు?

రాజమ్మ : ఎందుకూ చిక్కవా అమ్మా?

అమ్మ : చిక్కకేమమ్మా? చిక్కించుకునే చిక్కమయితే సరి.

రాజమ్మ : ఆ చిక్క మెక్కడ ఉంటుందమ్మా?

అమ్మ : చిక్కించుకునే చిక్కం అల్లేవాడిదగ్గర ఉంటుంది.

రాజమ్మ : నాకు చూపిస్తావా అమ్మా అల్లేవాడిని?

అమ్మ : వాడు కనపడకనే అల్లాడుతున్నారు.

రాజమ్మ : ఒహో వాడా?

అమ్మ : ఔను! వాడే వీడు.

కనుపించని ఆ దేవుడే కనుపించే యీ మానవుడన్న సత్యం గుర్తించిన వాడు తానే దైవమవుతాడు. ఆ స్థితికి చేరినవాడికి ప్రతి మానవుడూ మాధవుడుగానే కనుపిస్తాడు. కాని రాజమ్మగారు ఆ మాటను అమ్మ కేవలం తన పరంగానే ఉపయోగించిందనుకుని అడిగింది:

'చిక్కించుకునేదీ, చిక్కమూ రెండూ నీవేనా అమ్మా'

అమ్మ : ఇవన్నీ నాకెందు? నాకు మీరు చాల్లే.

రాజమ్మ : అమ్మా! నాకిది బాగానే ఉన్నది. అడుగడుగున పొరబడుతూనే ఉన్నాను. రెండు రకాల న్యాయమున్నది: మార్జాలకిశోరన్యాయమనీ, మర్కట కిశోర న్యాయమనీ. నన్ను నీవు కాని, నేను నిన్నుకాని ఎవరు ఎవరిని పట్టుకున్నా ఒకటేగా. నేను ఏదో అన్నాననుకోక మధ్య మధ్యలో యీ మాయనే కప్పుతూ, ప్రశ్నలకు సమాధానాలకు

తావుంచి నన్నిట్లా సంతోషపరుచమ్మా. ఒకటి హెచ్చూ ఒకటి తగ్గూ, ఒకటి మంచీ, ఒకటి చెడూ - ఈ ద్వంద్వాలు ఉన్నప్పుడే ఆనందంకూడా ఉన్నది. ఆ ఆనందమే ఆ నీ బ్రహ్మస్వరూపం.

అమ్మ : సంతోషం వేరు; ఆనందంవేరు. ద్వంద్వాలలో ఉన్నది సంతోషం. ద్వంద్వాతీతమయినది ఆనందం. ఆ ఆనందం బ్రహ్మస్వరూపం. గురువే బ్రహ్మ. ఆ గురువు మీరు.

రాజమ్మ : ఏమిటమ్మా? త్రిప్పి నా మెడకే వేశావు.

అమ్మ : మీరు చెప్పినవేగా, రెండు న్యాయాలూ, మెడకువేయట మేమున్నది?

రాజమ్మ : అమ్మా! ఒక చిన్నవిషయం మాట్లాడాలని ఉన్నది నీకు కలవస్తుందని చెప్పిననాడు నాకే తమాషా కల వచ్చిందమ్మా. ఆ కలలో యీ జరిగినదంతా చూశాను. అనుమానం కలిగింది కాని యిది యేమిటా అనుకున్నాను. అది మొన్నటి-పాకీవాడూ, పిల్లవాడు-తోనే చాలా భాగం తేలిపోయింది. అయితే మొదట యిక్కడిది అనుకోలేదు. ముందు ముందు నాకే ఏవో మార్పులు వస్తాయనుకున్నా. నీవు యీ రూపంతో యిట్లా వస్తావనీ, యిట్లాంటి అనుభవాలు యిస్తావనీ, నీవు పరదేవతవనీ, ప్రత్యక్ష ప్రమాణంగా చూస్తాననుకోలేదు. అయినా సర్వసామాన్యమయిన గృహస్థురాలవుగా ఉన్నావు కనుక నాకు నీజీవితగాథ అవసరం. ఆ గాథ నాకు వచ్చిన స్వప్నం ప్రకారం ఆలోచిస్తే- ప్రపంచానికి పారాయణ గ్రంథమవుతుంది. అయినా, నా స్వప్నం యథార్థమా, కాదా అని తెలుసుకుందామని ఉందమ్మా.

అమ్మ : మీ స్వప్నమంతా చెప్పండి. నా జీవితానికి సరిపోతుందో, బహుశః యిట్లా నడుచుకోమని చెప్పేదవుతుందో, మీకూ నాకూ

తెలియకుండా నడిపించేదౌతుందో జీవితమంతా ఒక రాత్రిలో కన్నారు గనుక నేను చెప్పడం కంటే మీరు చెప్పుతుంటే సరిపోతుందేమో చూచుకుంటాను.

రాజమ్మ : చెప్పేదా?

అమ్మ : ఊం.

రాజమ్మ : వణుకు వస్తున్నదమ్మా.

అమ్మ : నిద్రలో వచ్చిందా? స్వప్నమా? నిన్న నన్ను ధ్యానంలో కూర్చోబెట్టినపుడు కనుపించాయా? ఊరికే మనసుకు తడుతున్నాయా? నిన్న యిచ్చటకు వచ్చినప్పటినుండి జరిగిన సంగతులేనా? లేక నేను పుట్టినప్పటినుండి జరిగిన సంగతులన్నీ చూశారా?

రాజమ్మ : అమ్మా! నిమిత్తమాత్రమయిన యీ నాగురుత్వం ప్రపంచం కోసమా? నాకోసమా? అనేది నీ నోటి మీదగా చెప్పమ్మా-

అమ్మ : నేను చెప్పేవన్నీ మీకే తట్టుతున్నాయిగా.

రాజమ్మ : సమాధానాలు కూడా వస్తూనే ఉన్నాయి. నీ శబ్దం వినాలనీ; నీ భాషకూ, నీ భావానికీ కలిగే కలయికలో ఉండే మాధుర్యం అనుభవించాలనీ అడుగుతున్నానమ్మా. అందుకే యిందాక కోరుకున్నాను. మాయను కప్పుతూనే ఉండమని, నీవు పరదేవతగా తోచకుండా, సాధారణంగా కనబడుతూ సంభాషిస్తూ ఉంటే వచ్చే సమాధానాల సారమే నాకు ప్రసాదం. నీ దగ్గర కూర్చుని మాట్లాడుతుంటే- భావాలూ, భాష ఎటువంటి వారికైనా వాటంతటవే వస్తాయి. ఏం అమ్మా- కాదూ?

అమ్మ : అది నాకేమి తెలుస్తుందమ్మా? రావలసి వస్తుందికాని నాదగ్గర

కూర్చుంటే వస్తుందని అనను. కొంతమందికి మాటలు వస్తున్నాయి. కొంతమందికి కోపం వస్తున్నది. కొంతమందికి యేడుపు వస్తున్నది. అందరికీ ఒకటే రావడం లేదుగా.

రాజమ్మ : వారివారి ప్రారబ్ధం ప్రకారం వస్తున్నాయి.

అమ్మ : మామూలు మాటలేగా.

రాజమ్మ : సరేకానీ – యీసారికి మంత్రాన్ని గురించి, జపాన్ని గురించి అంటే ఆధ్యాత్మిక సాధనను గురించి మొదటినుండి నీవు ఏమి చేసినదీ యింతవరకు చెప్పు. మళ్లీ తరచు వస్తుంటావుగా.

అమ్మ : రప్పిస్తే.

రాజమ్మ : రానిస్తారా అమ్మా.

అమ్మ : అందరికీ మీ దయేగా.

రాజమ్మ : కాదమ్మా పొరపాటు పడ్డాను. నాలోయేవో భావాలు పరుగెత్తుతున్నాయి చెప్పేది... గృహస్థాశ్రమంలో ఉండి పతివ్రతయ్యై – అటు యోగసిద్ధీ, యిటు మంత్రసిద్ధీ పురోమార్గం, పశ్చిమ మార్గం రెండూ సిద్ధించినటువంటి జన్మ. ఛా! జన్మయేమిటి? అవతారంగాని! అదీగాక వేదాలలో ఉపనిషత్తులలో, సామాన్యమయిన బోధలలో శాస్త్రజ్ఞులు ఆడవారికి పాతివ్రత్య ధర్మం తప్ప యీ స్థాయికి అర్హత లేదన్నారు. ఉన్నదని నిరూపించి చూపించటానికి వచ్చిన అవతారమనీ, సహన దేవతవనీ, సహజ సహనమనీ యేమేమో అనిపిస్తున్నది. ఈ భావాలు నా వెన్నున తట్టి ఎవరో సోది చెపుతూ పుల్లపెట్టి చూపించినట్లుగా నీవే యింకొక రూపంతో తయార్తై చూపిస్తున్నావని కూడ చెపుతున్నది ఆ సోదెమ్మ.

అమ్మ : విశేషమేమున్నది? ఆదెమ్మకు అదేగా.

రాజమ్మ : ఎంత తేలగొట్టేస్తావమ్మా?

అమ్మ : తేలగొట్టేదేముంది? తేలిపోతున్నది తేలేరోజు వచ్చింది. ఆరోజే యీ రోజు. ఈ రోజు గురించి మరో రోజున అందరూ వింటారు.

అది 1949 ఆగష్టు 24వ తేదీ.

రాజమ్మ : అమ్మా! మధ్యాహ్నం 12 గంటలయింది. నిన్న ముద్దలుతిన్న వేళ యిది. ఈ పూట పెడతానన్నాను కదూ. తింటావా? రా-కూర్చుందాం. రా అరిటాకు కోసుకురా.

అమ్మ అరిటాకు కోస్తూఉండగా-

రాజమ్మ : అమ్మా కొంచెం పెద్దదిగా కోయి. నీ బిడ్డ తింటాడా?

అమ్మ : లేదమ్మా.

రాజమ్మ : బలహీనంగా ఉన్నావమ్మా. ఇంకా పాలెందుకు? అన్నం పెట్టరాదూ?

అమ్మ : వాడి పాలు ఉన్నాయమ్మా.

రాజమ్మ : లేవని కాదమ్మా.

అమ్మ : ఉన్నవి ఎట్లా మానగలడు? నేను ఎట్లా యివ్వకుండా ఉండగలను? ఎవరిపాలబడ్డపని వారికి తప్పదు. మీకు యింత వయస్సువచ్చి పెద్దవారయి, వంగిపోయి ఆయాసంతో యింత బాధతో మా అందరికీ రకరకాల రుచులతోనూ తినిపిస్తున్నారుగా! అదేస్థితి ప్రతివారికితప్పదు.

రాజమ్మ : తెలియకనా? ఏదో వాపోక అన్నానమ్మా.

అమ్మ అరిటాకు తీసుకుని లోపలకు వచ్చింది.

రాజమ్మ : విస్తరి కడిగి మంచినీళ్లు పెట్టమ్మా, ఇంట్లోకి వెళ్లి వంట బ్రాహ్మణుని అడుగు. అన్నీ యిస్తారు; తీసుకురా అమ్మా.

అమ్మ లోపలకు వెళ్లి వంటయింటి గుమ్మంలో నిలబడింది. అంతలో బాపారావుగారి

కోడలు రాజేశ్వరి అమ్మను చూచి

రాజేశ్వరి : ఎవరు మీరు?

అమ్మ : మాది యీ వూరు కాదమ్మా.

రాజేశ్వరి : ఎందుకు వచ్చారు? ..... పలుకరేం? మాకు భోజనాల వేళఅయింది – పిచ్చిబాగుల దానల్లే ఉందేం? పలకదేం? – ఏమిటమ్మా చెప్పు

ఆమె ప్రశ్నలేమీ వినిపించుకోకుండా సరాసరి లోపలకు వంట బ్రాహ్మణుని దగ్గరకు వెళ్లి–

అమ్మ : ఏమండి! బామ్మగారు మీదగ్గరకు వెళ్లమన్నారు.

వం. బ్రా : ఎందుకు?

అమ్మ : మీ దగ్గరకు వారు ఎందుకు పంపిస్తారో...

వం. బ్రా : వారెందుకు పంపించారో లే... నీవెందుకు వచ్చావో చెప్పు.

అమ్మ : వంట యింట్లోకి వెళ్లితే బ్రాహ్మణుడు అన్నీ యిస్తారు అని మాత్రమే బామ్మగారు చెప్పారు. ఫలానిది అడగమని చెప్పలేదు. అడిగివస్తా.

వం. బ్రా : ఉండు ఉండు–

అంతలో రాజేశ్వరి అక్కడకువచ్చి అమ్మను చూచి ఆశ్చర్యపోయి వంట బ్రాహ్మణునితో అన్నది:

' సుబ్బారావు! ఎవరామనిషి? సరాసరి వంట యింట్లోకి వస్తున్నదేమిటి? ఇట్లా యింట్లోకి వచ్చేవాళ్లు యింతవరకు ఎవరూ రాలేదు, పిచ్చా ఏమిటి యీ మనిషికి? '

వం. బ్రా : లేదమ్మా మన బామ్మగారు పంపారట

రాజేశ్వరి : బాగానే ఉన్నది యీ కుమ్ము. ఈవిడచేత పంపమన్నదా ఏమిటి?

అంతలో రాజమ్మగారి కోడలు సుబ్బమ్మగారు వచ్చింది. ఆమె అమ్మను ఎరిగి ఉన్నది.

సుబ్బమ్మ : నీవాఅమ్మాయ్! ఎప్పుడు వచ్చావు? అంతా కులాసాయేనా?

అమ్మ : ఆం.

సుబ్బమ్మ : ఇప్పుడు యీ వూళ్లో ఉండడంలేదా?

అమ్మా : లేదమ్మా.

సుబ్బమ్మ : పాపం. తల్లిలేని పిల్ల. నోట్లో నాలుక లేనిది. చిన్నప్పుడు ఆ చిదంబరరావుగారి యింట్లో ఎప్పుడూ గూట్లో కూర్చునిఉండేది. మాటాపలుకూ ఉండేదికాదు. చాలా అమాయకురాలు.

అంటూ నొసటన బొట్టుపెట్టుకుంటూ అమ్మ ముఖంవంక చూచింది: తళుక్కుమన్నది. వెంటనే ఆశ్చర్యంతో అడిగింది

' నీ ముఖాన ఉన్న కుంకుమ ఏమికుంకుమమ్మా!

అమ్మ : పవిత్రంచేసే కుంకుమ.

సుబ్బమ్మ : అందరిదీ అంతేగా?

అమ్మ : మరి ఎందుకు అడిగారు?

సుబ్బమ్మ : నక్షత్రంలాగ మెరుస్తుంటే అడిగానమ్మా.

సమాధానంగా అమ్మ పెదవులపై చిరునవ్వు తళుక్కుమన్నది. కనుపించీ కనుపించని పలువరుస తళుక్కుమన్నది. కుంకుమ తళుక్కుమంటున్నది. నొసలు తళుక్కుమంటున్నది. కన్నులు తళుక్కుమంటున్నాయి.

అనుకోకుండా ఆమె అమ్మ పాదాలవంక చూచింది. పాదాలనుండి తేజః పుంజం ప్రసరిస్తున్నది. సర్వావయవాలూ దివ్యకాంతియుతమై ఉన్నాయి.

ఏమిటీ తళుకు? ఎందుకీ మెరుపు?

ఏమీ అర్థంగాక ఉక్కిరిబిక్కిరై మనసును మళ్లించుకుని ఆమె అడిగింది.

' ఇంతకూ యిప్పుడు నీవెందుకు వచ్చావమ్మా '

అంతలో వంట బ్రాహ్మణుడు పదార్థాలన్నీ తీసుకువచ్చి అమ్మకు అప్పగించాడు.

సుబ్బమ్మ : ఏమిటది?

అమ్మ : బామ్మగారు నన్ను పంపారమ్మా – వీరు యిచ్చినవి పట్టుక రమ్మనమని.

సుబ్బమ్మ : నీవు అక్కడికెందుకొచ్చావు?

అమ్మ : చూచి పోదామని వచ్చానమ్మా.

సుబ్బమ్మ : ఆమె నీకెట్లా తెలుసు?

అమ్మ : మీ యింటి కెదురుగా ఉంటారే – ఆమె మా అత్తగారు.

సుబ్బమ్మ : ఎవరామె?

అమ్మ : తరచుగా మీ యింటికి వస్తారుగా అమ్మ.

సుబ్బమ్మ : మాయింటికి రారు. ఆవిడదగ్గరకు వచ్చిపోతారు కాబోలు.

లోపలనుండి రాజమ్మగారు అమ్మను కేకవేశారు. ఆ కంఠంలోని కంపన చూచి రాజమ్మగారికి కోపం వచ్చిందని, ఆమె కోడలు భయపడ్డది. కాని ఆ కంపన ఆ కొద్ది ఆల స్యానికే ఓర్చుకోలేని ఆర్తివలన కలిగిందని ఆమెకు తెలియదు. అందుకే అన్నది.

' ఓ అమ్మాయి! నిన్ను పిలుస్తున్నది. ఎంత ఆగ్రహం వచ్చిందో! నీకేమన్నా జబ్బా అమ్మా? ఎందుకు వచ్చావు? '

అమ్మ : అందుకే వచ్చా అమ్మా. పుట్టురోగిని.

అమ్మ తరుచుగా పలికే అసత్యం ' పుట్టురోగిని ' అనే మాట. ఆ పదప్రయోగంతో అమ్మ అనేక విషయాలలో సమాధానం చెప్పవలసిన బాధ్యతనుంచి తప్పించుకుంటుంది. అవసరమయిన కార్యం (రక్షణ) ఎట్లాగూ చేస్తుంది. కాని దానితో అనవసరమయిన మాటలు మాత్రం మానటానికి అవకాశం కలుగుతుంది.

సుబ్బమ్మ : ఆ కోపానికి ఎట్లా తట్టుక తింటావో.

అమ్మ : తినేది కోపం కాదుగా. మందేగా .... నే తినే మందులు నాకు ముందుగానే సిద్ధపడి ఉన్నాయి.

సుబ్బమ్మ : సరేనమ్మా. పో – పోయేటప్పుడు ఒకసారి వచ్చిపో.

అమ్మ : పోయ్యేది తెలిసి ఉంటే పోయేటప్పుడు అట్లాగే వచ్చిపోతా.

అంటూ అమ్మ గిన్నెలు చేతపట్టుకుని రాజమ్మగారి గదిలోకి వస్తూ– ఉండగా

సుబ్బమ్మగారు రాజేశ్వరితో అన్నారు:

ఈ అమ్మాయి మన బంధువులే. మన భారతి మేనమామ కూతురు. '

రాజేశ్వరి : ఏం మేనమామ కూతురో. అయోమయంగా ఉన్నది – అడవిలో పట్టుకు వచ్చినట్లు.

సుబ్బమ్మ : ఎందుకు? – ఈ కాలపు పిల్లల్లే లేదనా?

అమ్మ రాజమ్మగారి దగ్గరకు వెళ్లగానే –

రాజమ్మ : ఏం? అమ్మా! ఇంతసేపు చేశావేం?

అమ్మ : నేను చేయలా. అది అయింది.

అమ్మ ఎవరితో చెప్పేటప్పుడయినా, మనిషికి కర్తృత్వం లేదనీ, అంతా విధి చోదితం మాత్రమే ననీ చెప్పుతూ ఉంటుంది. తానూ మానుషరూపధారిణియే కాబట్టి అదే సత్యాన్ని తన పరంగానూ చెప్పుకున్నది.

రాజమ్మగారు ఆ వాక్యపు లోతుల్లోకి పోక– అమ్మ చంకలోని రవినీ, చేతుల్లోని వస్తువులనూ చూచి మానవ సహజమయిన సానుభూతీ ప్రేమలతో అన్నది:

' పిల్లవాడిని దించు; డొక్క నొప్పి పుడుతుంది. ఇందాకటినుండి యిట్లా ఎత్తుకుని ఉన్నావా? అయినా పిల్లవాడిని చంకలో పెట్టుకుని యివన్నీ ఎట్లా తెచ్చావమ్మా? '

అమ్మ : నేను పిల్లవాడిని మోస్తే– పిల్లవాడు కొన్ని మోశాడు.

రాజమ్మ : అబ్బా! ఏమి సమాధానాలమ్మా! వెతుక్కోవు.

అమ్మ : ఎక్కడన్నాపెట్టి మరచిపోతేగా – వెతుక్కోవటానికి.

రాజమ్మ : అదేనమ్మా! అదే. అమ్మా– నీ చేతిమీదుగా పెట్టు విస్తరిలో.

అమ్మ : అమ్మా! ఎట్లాపెట్టాలో మీరు చూపిస్తూ, చెపుతూ ంటే నేను పెడతానమ్మా.

రాజమ్మ : ఎప్పుడూ ఎవరికీ అన్నాలు పెట్టలా అమ్మా?

అమ్మ : పెట్టకేం అమ్మా? పెట్టాను. ఎప్పుడూ పెద్దవారుంటే వారినడిగి

చేయడం అలవాటమ్మా.

రాజమ్మ : ఎంత వినయ విధేయతలు తల్లీ!

అమ్మ : అంతా మీ ఆశీర్వచనమే.

రాజమ్మ : అమ్మా! – ఆశీర్వచనమంటే......

అమ్మ : నిర్వచనం లేనిది.

రాజమ్మగారు సన్నగా నవ్వుకొని అన్నది:

' ఏమన్నా – సిద్ధంగా ఉంటాయ్ సమాధానాలు. నీ నోటిలోనే మాధుర్యమున్నదమ్మా'

అమ్మ విస్తరివేసి మంచినీళ్లు పెట్టి అడిగింది:

' ఏమి చెయ్యమంటారు? '

రాజమ్మ : విస్తరి శుద్ధిచేసి నెయ్యి రాయి. నెయ్యి రాచి ముందు పదార్థాలు వడ్డించు.

అమ్మ : అన్నీ పదార్థాలేగా. అయినా పదార్థాలంటే అర్థమేమిటో – పదాల అర్థాలా? లేక వస్తువులా?

రాజమ్మ : అబ్బా కాదమ్మా – అనుపాకాలు.

అమ్మ : అనుపాకాలా? పాకాలా? పక్వం చేసేవన్నీ పాకాలేగా. పక్వమయినదే పాకం. చేసేది పాకం కాదు.

అంటూ అమ్మ ఎదురుగా చూస్తూ ఉంది.

రాజమ్మ : ఏం అమ్మా! వడ్డించమంటే వీధికేసి చూస్తావేం?

అమ్మ : వీధివంక కాదమ్మా పాకాలవంక. పాకాలు అన్నారుకదూ!

రాజమ్మగారు ముసిముసిగా నవ్వుకుని చెప్పింది:

' సరే. సరే. గొడ్లపాకాలా చూచేది? సరేకాని వడ్డించు '

విస్తట్లో ఈశాన్యమూలగా చామదుంపలకూర, నైఋతి దిక్కున పప్పు, ఆగ్నేయాన, పెరుగు, పులుసు, అరటికాయకూర, వాయవ్యమూలన నువ్వులపొడి, అన్నం

మధ్యలో వడ్డించి, అన్ని పదార్థాలమీద నెయ్యి వడ్డించు. అష్టదిక్కుల ఊరగాయలు, తూర్పున మామిడికాయ ఆవకాయ దక్షిణాన ఉసిరికాయ ఆవకాయ, పడమట దోస ఆవకాయ, ఉత్తరాన బూడిదగుమ్మడి ఆవకాయ ....

రాజమ్మగారి సూచన ప్రకారం అమ్మ అన్నీ వడ్డించింది.

రాజమ్మ : అభిఘరించావా అమ్మా:

అమ్మ : ఎక్కడ వెయ్యాలమ్మా?

రాజమ్మ : అన్నం మీదనే వెయ్యమ్మా.

అమ్మ : తెలియక అష్టదిక్కులా వేశానమ్మా.

రాజమ్మ : ఇంకా యేం? తెలియకపోవటమే? అంతా తెలిసిన కొంటెతనమే.

అమ్మ : ఆఁ– నా తెలియని ఒంటరితనమే దీనికి కారణం.

రాజమ్మ : సరేనమ్మా. వస్తున్నా–నిన్నటి ధ్యాన శ్లోకమూ, మంత్రమూ ఒకసారి పఠించు.

అమ్మ పఠించింది.

రాజమ్మ : అమ్మా! అన్నిరకాల పదార్థాలూ అన్నంలో ఒకేసారి పడేటట్లుగా నాలుగు మూలలా కలుపగలవూ?

అమ్మ : కలపవచ్చుగాని, ఒకమూల పట్టుకున్న తర్వాతనే యింకొకమూల పట్టుకోవాలిగా.

రాజమ్మ : పేచీ వెతుకుతావమ్మా.

అమ్మ : కనపడుతుంటే వెతికేదేమిటి?

రాజమ్మ : కనపడుతుంది. కనపడుతుంది. నీయిష్టం వచ్చినట్లు కలుపు.

అమ్మ : వడ్డించడం నీ యిష్టమూ; కలపడం నా యిష్టమూనా?

రాజమ్మ : ఎదురు మాట్లాడక కలుపు.

అమ్మ కలిపింది. రాజమ్మగారు యిద్దరం కలిసి తిందామన్నది. అమ్మ రాజమ్మగారిని

పెట్టమని అడిగింది.

రాజమ్మ : నిన్న నేను పెట్టానుగా? ఇవాళ నీవు పెట్టమ్మా.

అమ్మ చేతిమీదుగా ముద్దలు పెట్టించుకు తినాలని రాజమ్మగారికి కాంక్ష కలిగింది.

అమ్మ : ఇంతకూ యీ ముద్దలకు, యీ కలపటాలకు, యీ తింటాలకూ అర్థం చెప్పరూ?

రాజమ్మ : చెపుతాలే – ముందు చెయ్యి పెట్టు.

అమ్మ : చెయ్యలేని దానినమ్మా.

రాజమ్మ : చెయ్యలేని దానివా?

అమ్మ : చెయ్యి పెట్టకుండా, బోర్లపడుకుని, కళ్లుమూసుకుని ఎవరేమీ తింటున్నారో తెలియకుండా తిందాం.

రాజమ్మ : సరే మొదలుపెట్టు.

అమ్మ : పెట్టుకాదు: పెడదాం.

రాజమ్మ : వొంగు.

అమ్మ : ఇద్దరమూ వొంగుదాము. గుటుకు గుటుకు మింగుదాము, గుప్‌చిప్‌గా లేద్దాము.

రాజమ్మగారు పకపకా నవ్విఅన్నది:

' ఉభయభాషా ప్రవీణవా, నానాభాషా ప్రవీణవా? '

అమ్మ : ఏం? భాషా ప్రవీణ అంటే చాలదా? అయినా ప్రవీణ ఎందుకు? పరిమితి ఉన్నదందులో. స్తనితధారాధరంబు నీవె అను. అదయినప్పుడు నిర్మలమయిన ఆకాశమౌతాను.

రాజమ్మ : అంటే–శూన్యమా?

అమ్మ : గుర్తిస్తున్నంతవరకు శూన్యమెక్కడ ఉన్నది? శూన్యమంటే గుర్తు లేకపోవడం.

రాజమ్మ : ఆకాశం నిరాకారం కాదూ?

అమ్మ : నిరాకారంకూడా ఆకారంతోనే ఉన్నదిగా.

రాజమ్మ : ఆకాశం గగనం శూన్యమని–శాస్త్రం చెపుతున్నదిగా.

అమ్మ : ఆకాశమంటే అవకాశమేగా! కాదా? గగనమంటే–

రాజమ్మ : ఏమో నాకు తెలియదు. సగుణంలో మాట్లాడే మాటలు నీవి.

అమ్మ : నిర్గుణంలో మాటలు రెండు చెప్పండి.

రాజమ్మ : నిర్గుణంలో చెప్పేదేముందీ?

అమ్మ : అంటే–చెప్పేగుణం, చెప్పని గుణం...... అక్కడా గుణమున్నదిగా!

రాజమ్మ : అబ్బా! ఏమోనమ్మా. పోనీ నీవు చెప్పు ఎట్లా అది అవకాశమయిందో....

అమ్మ : భూమి ఆధారమయింది కనుక ఆకాశాన్ని ఆకారంగా గుర్తించటానికి అవకాశమిచ్చింది భూమి. ఆకాశమంటే ఇంతవరకే నాకు తెలుసు. గగనమంటే ఏమిటో మీరు చెప్పండి.

రాజమ్మ : ఇప్పుడు చెప్పలేను కానీ– అయినా, గగనమంటే అందనిదంటారు. ఈ మధ్యలో లలితాస్తోత్రంలో ఖడ్గమాలలో ' నీలపతాకాయైనమః ' అని వచ్చింది. నిన్నుగురించి స్వప్నం కనేటప్పుడుకూడా నీవు ఖడ్గమాల చదువుతున్నట్లుగా వినపడ్డది. ఆ నామానికి అర్థమేమిటమ్మా?

అమ్మ : నాకు మాత్రమేమి తెలుసునమ్మా? పతాకమంటే జండా అని వాడుకపదమే. నీలపతాక అంటే ఆకాశం జండాగా ధరించినదని.

రాజమ్మ : బాగున్నదమ్మా. నేను చాలామంది నడిగాను. ఈ భావాలు ఎవరూ చెప్పలేదు. అయినా ప్రతిదానికి యింత సులువుగా నీకు ఎట్లా తెలుస్తుందమ్మా? షట్శాస్త్ర సంపన్నులకు కూడా వెతుకులాట

ఉంటుంది.

అమ్మ : అసలు ఎన్ని శాస్త్రాలమ్మా?

రాజమ్మ : వాస్తు శాస్త్రము, వైద్యశాస్త్రము, సంగీతము, గణితమూ, వేదాంతమూ....

అమ్మ : అయిదే చెప్పారేం?

రాజమ్మ : ఏవో ఉంటాయి యింకా – ధర్మశాస్త్రమూ.....

అమ్మ : ఇవన్నీ ధర్మశాస్త్రంలోనివి కావా?

రాజమ్మ : కాకేం? చెయ్యి ఎండిపోతున్నది. తిందాం, రా.....

ఇద్దరూ కలిసి ఒకేసారి పడుకుని కళ్లుమూసుకుని తినడం ప్రారంభిచారు. తింటూ ఉండగా ఒకవైపు పిల్లీ, ఒకవైపు కుక్కా కలియబడ్డాయి. తింటూ ఉంటే–రాజమ్మగారి నోటికి ఎన్నడూ తినని యేదో క్రొత్తరుచి కలుగుతూ ఉన్నది. అంతలో రాజమ్మగారి నోటికి కుక్కమూతి తగిలింది. ఉలిక్కిపడి కళ్లుతెరచింది. విస్తట్లో అన్నం అయిపోయింది. పిల్లీ, కుక్కా ఆమెవంకచూస్తూ ఉన్నాయి. అక్కడ లేకపోయినా పందిపిల్లలుకూడా ఉన్నట్లు ఆమెకు కనబడ్డది.

రాజమ్మ : అమ్మా! నీవన్న పరిపూర్ణమిదా?

అమ్మ : ఆఁ – సంపూర్ణం.

రాజమ్మ : ఈ విస్తరి యేం చేయమంటావమ్మా?

అమ్మ : నేను తినేస్తానమ్మా.

రాజమ్మ : ఆకులెట్లా తింటావమ్మా?

అమ్మ : ఈ రోజు మినహా తింటున్నదంతా ఆకులే కనుక అడ్డులేదు. అమ్మ విస్తరి తినడం ప్రారంభించింది.

రాజమ్మ : అరిటాకు తిన్నా–కాడ తినలేవమ్మా.

అమ్మ : అరిటాకు చూస్తే–నా వీపు గుర్తుకు వస్తుందమ్మా.

రాజమ్మ : నీ వీపేం? అందరి వీపులూ అట్లాగే వుంటాయి.

అమ్మ : అందరి వీపులను గురించీ ఆలోచన లేదు. నా వీపు నా వైపు తిరగదు కనుక యిట్లా ఉంటుందేమోనని ఊహించుకుంటున్నా.

రాజమ్మ : అయినా తినకు. వీపుమీద పెట్టిచూస్తాను...

రాజమ్మగారు అమ్మ వీపుమీద పెట్టగానే వెడల్పు, బారు సరిపోయి ఆకుపైఉన్న చారలు ఎముకలలాగ కనపడి కాడ వెన్నుపూసలాగా కనపడింది. అప్పుడు ఆమె అన్నది.

' సత్యభాషివి; ధర్మరూపివి; మార్గదర్శివి; ఆదర్శజీవివి. ఏమయినా నీవెందుకు వచ్చావో అర్థం కావడంలేదు. '

రాజమ్మగారు ఆకు మడిచి దగ్గర పెట్టుకున్నది. మధ్యాహ్నం మూడున్నర అయింది. అమ్మ దొడ్లోకివెళ్లి చీపురు, నీళ్లు పట్టుకువచ్చి కడగటానికి ప్రారంభించింది.

రాజమ్మ : వద్దమ్మా! నేను కడుగుతాను.

అమ్మ : నాకు మురికి పోగొట్టడం నేర్పరూ?

రాజమ్మ : ఈ మురికి పోగొట్టక పోతావా? రోజూ చేస్తూనే ఉంటావుగా-

అమ్మ : చేతకావటానికీ, రోజూ చేయటానికీ సంబంధంలేదు.

రాజమ్మ : అవునులే, అమ్మా! చీపురే జ్ఞానోపదేశం చేసేటట్టుందా?

అమ్మ : మీ ద్వారా చీపురమ్మా

రాజమ్మ : నిన్న కత్తిపీటనన్నావు. ఇవాళ చీపురన్నావు. అది ఛేదించేదన్నావు. ఇది తీసేసేదన్నావు. ఇంకా ఏమయినా ఉన్నాయా? అసలు వేదాలు నీ నోటిలో పుట్టినవేగా!

అమ్మ : అవును, నా నోటిలో పుట్టి నాకు తెలియకుండా మీ నోటిలో పడితేను-మీదగ్గర విందామని వచ్చాను.

రాజమ్మ : విందామనా? తెలుసుకుందామనా?

అమ్మ : వేదమంటే-శబ్దమేగా! వినేదే విన్నప్పుడు తెలుసుకునేదేముంది?

రాజమ్మ : సాంఖ్యయోగం వేరే అక్కర్లేదు. నీతో మాట్లాడితే అమనస్కానికి వెళ్లవచ్చు. అయినా, అమ్మా! ఇదంతా సరేకానీ, నీ జీవితగాధ చెప్పవూ?

అమ్మ : వెలలేనిగాధమ్మా! అగాధమునకూ పరిమితి ఉన్నది.

రాజమ్మ : అంటే అగాధమా?

అమ్మ : దానికీ పరిమితి ఉంది.

రాజమ్మ : ఇప్పుడు కాకపోయినా, మరొకప్పుడయినా- నీ పుటకా, యీ లక్షణాలూ అంటే దైవలక్షణాలూ అవి ఎప్పుడు బహిర్గతమైనదీ, దేని నిమిత్తంగా ఎవరు ఎట్లా గుర్తించిందీ, చిన్నప్పటినుండీ నీ అనుభవాలూ..... అనుభవాలు ఏమిటి - మహిమలూ చెప్పమ్మా! నీవు పుట్టగానే ఆముదం పోశారనుకో - అది ఎట్లా ఉండి త్రాగావో తెలియదుగా. అదీ చెప్పమ్మా! నీ కళ్యాణాన్ని గురించి కూడా వినాలని ఉందమ్మా. నీ కళ్యాణం లోక కళ్యాణంగా ఉంటుందనుకుంటాను.

అమ్మ : లేదమ్మా. లోకమే నా కళ్యాణం. నా కళ్యాణం లోక కళ్యాణం కాలా.

రాజమ్మ : ఇదొకటి. ఇంకో చిన్నకోరిక ఉందమ్మా. నీకు కొన్ని మంత్రాలిస్తాను. ఈ మంత్రాలన్నీ ప్రపంచానికి వెదజల్లమ్మా. ఇంకొకటి - అయినా యిప్పుడు వద్దులే - ఏమంటావు మంత్రాల సంగతి?

అమ్మ : ఇంతవరకు మంత్రమంటే నాకే అర్థం కాలేదు. నే నెక్కడ వెదజల్లేది?

రాజమ్మ : నీవే మంత్రానివి. నీకు అర్థంకావడమెందుకమ్మా?

అమ్మ : అప్పుడు నే వెదజల్లేదేముంది?

రాజమ్మ : నేను రాసిస్తాను. చెప్పిన మాటలు చెప్పు - అడిగినవారికి వారి వారి తాహతు కొద్దీ.....

అమ్మ : అదిగో – నన్నంటూ మీరే పేచీ వేశారు. వాళ్లను తూచే త్రాసు నాదగ్గర లేదు.

రాజమ్మ : నీకు ఉన్నా లేకపోయినా నేను శాసిస్తున్నాను. ఇది నీకు తప్పదు.

అమ్మ : తప్పనిదయితే జరుగుతుందిగా?

రాజమ్మ : జరగనిదయితే తప్పుతుందా?

అమ్మ : మొదటి మాటలోనే రెండు అర్థాలూ ఉన్నాయి.

రాజమ్మగారు అమ్మ రెండు చేతులూ పట్టుకుని–

' అమ్మా; ఇది నీకు తప్పదు. శాసనం కాదులే–కోరిక.... '

అమ్మ : కోరికలన్నీ తీర్చగలనా? కోరికలు కోరలేను; తీర్చలేను.

రాజమ్మ : అవును; అసమర్థురాలివే – ఆఁ సమర్థురాలివే.

అమ్మ : సమర్థత యిచ్చినప్పుడు సమర్థించటానికి బాధేమున్నది? అంటే మాటలతో చెప్పటం కాదు. మనస్సుకు తోచేటట్టు చేయాలి

రాజమ్మ : ఊఁ సరే – వినవా?

అమ్మ : వినకేమమ్మా? వింటాను. చెయ్యలేను.

కొంచెం సేపు నిశ్శబ్దంగా గడిచింది. రాజమ్మగారు ఒక కాగితంమీద 70 మంత్రాలు వ్రాసి అమ్మకు యిచ్చింది. 'రామచంద్రాయ', 'రామభద్రాయ', 'శ్రీరామచంద్ర', 'జయజయ విఠల్ ', – యిట్లా కొన్ని మంత్రాలు వ్రాసి చెప్పింది.

' ఏ దేవుడు యిష్టమయినవారికి అది యివ్వమ్మా.... '

అమ్మ : నాకేం తెలియదు. నాకు చేతగాదు నా కక్కరలేదు.

రాజమ్మ : పోనీ – నా పేరు చెప్పి ఫలానివారు యివ్వమన్నారని చెప్పియివ్వమ్మా

అమ్మ : నా కెందుకీ వ్యాపారం? వారిని మీ దగ్గరకూ, మిమ్మల్ని వారిదగ్గరకూ లగేజి చెయ్యొద్దూ?

రాజమ్మ : అందుకేగా మరి–

అమ్మ : మొత్తంమీద వ్యాపారం తప్పదంటారు. మీరు చెప్పమన్నట్లు ఋజవేమిటి?

రాజమ్మ : ఇంత దూరం వచ్చావు కనుక యిక ఫర్వాలేదులే.

అమ్మ : కాదులే.

రాజమ్మ : ఏంకాదు?

అమ్మ : మీరు ఏది ఔనంటే – అది కాదు.

రాజమ్మ : ఔను కాదా?

అమ్మ : అవునూ, కాదూ – అనేది లేదుగా.

రాజమ్మ : అమ్మా! ఈ ఒక్క మాటకు నాలుగర్థాలున్నాయి.

అమ్మ : ఈ నాలుగింటిలో ఏది జరగవలసి ఉంటే అదే జరుగుతుంది.

రాజమ్మ : ఇందాక ఋజువన్నావుకదూ? ఇందాక నేనూ ఇంకొక్క కోరిక........ అని యిప్పుడు కాదులే అన్నాను. అదే యిప్పుడు అవసరమయింది. ఒక చిన్నఫొటో తీయిస్తావూ?

అమ్మ : నేను కాదుగా తీయించేది. మీరు తీయిస్తే వచ్చికూర్చుంటాను, అదికూడా వారిని అడిగివచ్చి. అయినా ఫొటోలు ఎప్పుడూ తీయించుకోలేదు. చిన్నప్పుడు ఒకటి తీయించారు. 1947 ఆగష్టు 15న అనుకోకుండా వారితో కలిసి యింకొకటి తీయించుకొనడం జరిగింది.

రాజమ్మ : అయినా అడిగి చూడమ్మా............

అమ్మ : మీరెన్ని ఋజువులిచ్చినా, ఎన్ని ప్రమాణాలు చేయించినా, నాకు 33 సంవత్సరాలు వస్తేనేకానీ ఏ పనీ జరుగదనుకుంటాను. అప్పటికయినా ఎప్పుడూ కాదు. మీ కోరికప్రకారం కొంతసంఖ్య యివ్వండి. ఆ ప్రకారం చేస్తాను.

రాజమ్మ : ఎప్పుడో కాదమ్మా. ఈ పూట ఒక్కటయినాచెయ్యి.

అమ్మ : ఈ మంత్రాలను గురించి చాలా గొడవలు వింటున్నాను. కుట
చిక్కులకూ, మంత్రాలకూ ముడిపెడుతున్నారు. హెచ్చుతగ్గు
మీరే బాధ్యులు.

రాజమ్మ : సరేలే! నీ భర్తను కనుక్కుంటావా?

అమ్మ : ఫొటో సంగతేకాదు ఇదికూడ.

రాజమ్మ : అట్లాగే కనుక్కో.

తర్వాత నాన్నగారి అనుమతితో అమ్మ రాజమ్మగారితో కలసి ఫొట
తీయించుకున్నది.

ఆ తరువాత 03-02-1958లో మాఘపూర్ణిమ రోజున రాజమ
గారు కోరినట్లుగా అమ్మ మంత్రోపదేశం చేసింది. తెల్లవారుఝామున 4.0 గంటలకు ప్రారంభించి తెల్లవారేలోగా 600 మందికి పూర్తిచేసింది. ఒక్కొక్కరి ధ్యానశ్లోకం చెప్పి అవసరమయిన వాళ్లకు మంత్రార్థాన్నీ వివరించింది. ఆ లెక ప్రకారం పదిగంటలన్నా పట్టాల్సిన కార్యక్రమాన్ని 2.30 గంటలకే ముగించింది. అమ సూర్యోదయాన్నే ఆపివేసిందా అని అక్కడున్నమేమంతా విస్మయం చెందామ పాతివ్రత్యాన్ని ఆధారం చేసుకుని పంచభూతాలను జయించిన అమ్మ కాలా స్థంభింపచేసి తనకు అనుకూలంగా మలచుకోవటంలో విశేషం ఏమున్నది?

మాతృశ్రీ జీవిత మహోదధిలోని ఒక ఉత్తుంగ తరంగం ఈ మ. మంత్రోపదేశం అనటంలో అతిశయోక్తి లేదేమో!

సర్వశక్తిమయీ

సర్వ మంగళా

సద్గతిప్రదా

నమోఽస్తు.



రచయిత్రి

శ్రీమతి బ్రహ్మాండం వసుంధరాదేవి

జననం: 1944 జనవరి 11
జననీ జనకులు: కీ.శే కోన వెంకాయమ్మ, కీ.శే కోన వెంకట సుబ్బారావు.

అమ్మ దివ్యదర్శనం ప్రప్రథమంగా 1958 ఫిబ్రవరి 1వ తేదీన,ఆరోజునుంచీ అమ్మ అంటే అమితమయిన భక్తి, అచంచల విశ్వాసం, అపార గౌరవం.

1962 నుంచీ అమ్మ సేవకు సంపూర్ణంగా అంకితం. అమ్మ కనుసన్నలలో అనురాగ జీవనం అమ్మ సన్నిధే పరమావధిగా నిబద్ధ జీవితం.

అమ్మయే సర్వస్వంగా విశ్వసించిన వసుంధర అక్కయ్యకు అమ్మ1966, మే 5వ తేదీన మంగళసూత్రం కట్టి అర్ధాంగిగా స్వీకరించటం ఆమె జీవితంలో గొప్పమలుపు; అది వాత్సల్యరూపిణి అమ్మ ప్రేమాభిమానాలతో తన దగ్గరకు పిలిచిన తీయని పిలుపు.

ఆనాటి నుంచీ ఈనాటి వరకు అమ్మ చరణ సన్నిధిని విడవని పుణ్యచరిత; అమ్మ సూక్తులను త్రికరణ శుద్ధిగా ఆచరణలో పెడుతున్న ఆదర్శ వనిత -- వసుంధర అక్కయ్య.

అక్కయ్య తన సహజ శైలిలో రచించిన శ్రీవారి చరణ సన్నిధి మాన్యులు, సామాన్యులు మెచ్చిన గ్రంథం.